తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం
వార్షికోత్సవం 1996 - 2026

# రోజా..! నోరు అదుపులో ఉంచుకోండి

**- లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది**
**- ఎమ్మెల్యేలు మురళి మోహన్ , పులివర్తి నాని**



తిరుపతి హెల్త్, మార్చి 20 ప్రభాతవార్త: మాజీ మంత్రి రోజా నోరు అదుపులో ఉంచుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళి మోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిలు హెచ్చరించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాజీమంత్రి రోజా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయాలలో విమర్శలు, ప్రతి విమర్శలు సంస్కారవంతంగా ఉండాలని హితవు పలికారు. మాజీ మంత్రి రోజా వారిపై చేసిన విమర్శలు అర్థరహితమన్నారు. రోజా మీరు నోరు అదుపులో ఉంచుకోండి, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మీరు ఒక మనిషిలా కాదు, గాడిదలా మాట్లాడుతున్నారని వ్యంగోక్తులు విసిరారు. హైందవ సనాతన ధర్మాలు గూర్చి మీ నాయకుడి దగ్గర నేర్చుకునేంత దీనస్థితిలో మేము లేమన్నారు.రోజాకు దమ్ము, ధైర్యం ఉంటే ముందు మీ నాయకుడిని కుటుంబ సమేతంగా వచ్చి డిక్లరేషన్ ఇచ్చి తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోమని చెప్పుమని డిమాండ్ చేశారు. 2019 నుండి 2024 వరకు తిరుమలలో మీ పాలకులు, మీ పాలకమండలి సభ్యులు అపవిత్రం చేశారని గుర్తు చేశారు. హిందూ మనోభావాలతో ఆడుకున్నారన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రభుత్వ వాహనాలలో తిరుమలలో లడ్డూలు పంచుతూ అడ్డంగా దొరకలేదా..? అని ప్రశ్నించారు. తమ నాయకుడు మాకు సంస్కారం నేర్పారని, మేము మాట్లాడే మాట,నడుచుకునే తీరు పద్ధతిగా ఉంటాయన్నారు. మీ అంత హీనంగా మాట్లాడలేమన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ గూర్చి మాట్లాడే అర్హత నీకుందా అని ప్రశ్నించారు. హిందూ సనాతన ధర్మాన్నే కాకుండా ప్రతి మతాన్ని గౌరవించే వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు. మగవాడు మాట్లాడే భాషను మీరు మాట్లాడుతున్నారని, ముందు ఆ తీరు మార్చుకోవాలని రోజాకు హితవు పలికారు.

## అంతరాయం లేకుండా ఎల్పిజీ సిలెండర్ల సరఫరా

**- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశం**



సిఎంతో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఇన్‌ఛార్జీ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: అంతరాయం లేకుండా ఎల్పిజీ గ్యాస్ సిలెండర్ల సరఫరా చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. సిఎం నారా చంద్రబాబునాయుడు విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం వంట గ్యాస్ సిలెండర్ల సరఫరాపై ఉన్నత అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఇరాన్-ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్ని రోజుల పాటు యుద్ధం కొనసాగితే ఎల్పిజీ గ్లోబల్ సప్లై చైన్ దెబ్బతినే అవకాశం వుందని, ఆ సంక్షోభంను ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి వుందన్నారు. ఎల్పిజీ గ్యాస్ సిలెండర్ల సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విద్యా సంస్థలు, ఆలయాలు, అన్నా క్యాంటీన్లు, అంగన్‌వాడీ సెంటర్లకు గ్యాస్ డెలవరీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి కేంద్రీకరించాలని సిఎం చంద్రబాబునాయుడు సూచించారు. అలాగే ఎరువులు, పెట్రోల్, డిజీల్‌కు కొరత రానివ్వకుండా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపాలని అధికారులకు సిఎం స్పష్టం చేశారు. కలెక్టరేట్ నుండి ఇన్‌ఛార్జీ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆయన ఛాంబర్ నుండి సిఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# పెనుగాలుల బీభత్సం

**-పండ్ల తోటలు ధ్వంసం**
**-710 ఎకరాలు నేలమట్టం రూ.10 కోట్లు నష్టం**




రైల్వే కోడూరు, మార్చి 20 ప్రభాతవార్త: గత బుధ, గురువారాల్లో ప్రకృతి పండ్ల తోటల రైతులపై కన్నెర్ర చేసింది. అర్ధరాత్రి సమయంలో ఉన్నపలంగా వడగండ్ల వాన, పెనుగాలుల బీభత్సానికి రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారి పల్లి, కోడూరు మండలాల్లో అరటి, ఆకు తోటలు నేలమట్టమ య్యాయి. దీంతో సుమారు 710 ఎకరాలు పండ్ల తోటలు ధ్వంసం కాగా సుమారు 10 కోట్ల మేర నష్టం వాటిల్లింది.ఈ పెనుగాలలకు రెండు మండలాలలోని గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్లు, విద్యుత్ స్తంబాలు విరిగిపోయాయి. దీనితో అనేక గ్రామాల్లో విద్యుత్ అంతరాయము కూడా ఏర్పడింది. ఈ సంఘటన జరిగి నేటికీ మూడురోజులు పూర్తి అయినప్పటికీ ఇప్పటికి కొన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించక అంధకారంలో కొన్ని గ్రామాల ప్రజలు సతమతమవుతున్నారు. ఈ గలులకు విద్యుత్‌శాఖకు కూడా లక్షల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. శుక్రవారం ఈ రెండు మండలాల ఉద్యానవన శాఖ అధికారి అంచనాల మేరకు 668 ఎకరాలు అరటి, 4 ఎకరాలు మేర తమలపాకు తోటలు నేలమట్టం అయినట్టు ఆ అధికారి సుధాకర్ తెలిపారు. నియోజకవర్గంలో 22 వేల ఎకరాలు అరటి సాగు చేయగా 11 వేల ఎకరాలు బొప్పాయి, 400 ఎకరాలకు పైగా తమలపాకు తోటలు సాగుచేసినట్లు తెలిపారు. అయితే బొప్పాయి సాగు ఇటీవలనే చేపట్టడంతో ఏమాత్రం నష్టం వాటిల్ల లేదన్నారు.అరటి పంట రైతుకు చేతికందే సమయంలో పెనుగాలుల బీభత్సానికి, ప్రకృతి వైపరీత్యానికి గురై నేలమట్టం అయ్యాయని తెలిపారు సుమారు ఏడాదిన్నర పాటు రైతులు కంటికి రెప్పలా రాత్రింబవళ్లు కాపాడుకున్న అరటి, తమలపాకు తోటలు దిగుబడి సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసి పెనుగాలుల రూపంలో రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. ఓబులవారిపల్లి మండలంలో 40 ఎకరాలకు పైబడి తమలపాకు తోటలు నేలమట్టమయ్యాయి. అరటి తోటల పరిస్థితి అయితే సుమారు 11వేల ఎకరాలకు పైగా గాలికి నేలకొరిగి ఆరుగాలం కష్టించిన రైతులకు కడగండ్లు మిగిల్చాయి. ప్రతి ఏటా రైతులకు పంటల దిగుబడి వచ్చి చేతికందే సమయంలో ఏదో ఒక రూపాన ప్రకృతి పగబట్టి కన్నెర్ర చేసి రైతులను నిట్ట నిలువునా నష్టాల పాలు చేయడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకపోతే అధిక శాతం నష్ట పోయిన రైతులు అప్పుల ఊబిలో నుంచి కోలుకోలేక ఆత్మహత్య శరణ్యం అన్నట్లు పరిశీలించను బోయిన అధికారుల ఎదుట కన్నీరు పెట్టుకున్నట్లు తెలుస్తుంది. నష్టపోయిన పండ్ల తోటల రైతులను చూస్తే రేపో మాపో దిగుబడి చేతికొచ్చే సమయంలో జరిగిన ఈ నష్టాన్ని, రైతుల బాధలను చూసి ఎటువంటి వారి కైనా కడుపు తరుక్కుపోక తప్పలేదు.

## తీరు మార్చుకోకుంటే... చర్యలు తప్పవు

**-తిరుపతి నియోజకవర్గ పార్టీ నేతలకు చంద్రబాబు చురకలు**



ప్రభాతవార్త-తిరుపతి:
తిరుమల పర్యనటలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం రాత్రి విచ్చేశారు. తిరుమల అతిథి గృహంలో కొందరు నేతలతో ఆయన మాట్లాడరు. తిరుపతిలో పార్టీ నేతల వ్యవహారంపై ఫిర్యాదులు ఉన్నాయని, కలసి పనిచేయకుంటే చర్యలు తప్పవని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. క్షేత్రస్థాయిలో నేతలు మరోలా ఉంటున్నారని, ప్రజలతో కలిసి పనిచేయకుంటే పక్కన పెడతానని హెచ్చరించారని, కూటమితో కలిసి పనిచేయాలని నిర్దేశం చేశారు. సొంత జిల్లాలో ఎంతో కీలకమైన తిరుపతి నియోజక వర్గంలో టిడిపి నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడు తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 నెలలు పూర్తయినా కార్యకర్తలకు దిక్కూ దరి లేదు. ప్రతి పక్షంగా ఉన్నప్పుడు పోరాటం చేసిన నేతలను పట్టించుకునే వారే లేరని పార్టీ నేతల్లో నైరాశ్యం. గత ఎన్నికల ముందు వైసిపి నుంచి వచ్చిన వారు, పార్టీతో సంబంధం లేని వారు పెత్తనం చెలాయిస్తున్నారని నాయకులు బాహాటంగా వాపోతున్నారు. కూటమి ధర్మం పాటించి చిత్తూరు నుండి వచ్చిన వైసిపి ఎమ్మెల్యే శ్రీనివాసులు జనసేన అభ్యర్థిగా తిరుపతి జనం ఆదరించారు. ఇప్పుడు అతను టిడిపి నేతలను పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చిన దివాకర్ రెడ్డి తుడా ఛైర్మన్, టిటిడి ఎక్స్అఫిసియా సభ్యుడు, పార్టీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలు అందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి సూరా సుధాకర్ రెడ్డి పదవులు ఆశించి భంగ పడ్డారు. తెలుగు మహిళ జిల్లా మాజీ అధ్యక్షురాలు పుష్పావతియాదవ్ ను పట్టించుకునే వారు లేదు. ఈ దరిమిలా జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడఆ వైసిపి నుండి వచ్చిన కార్పొరేటర్లను నెత్తిన పెట్టుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. వైసిపి నేతలతో రహస్య సంబంధాలు ఉన్న మాజీ యూత్ కాంగ్రెస్ నేత ఆర్ సి మునికృష్ణ డిప్యూటీ మేయర్ గా చక్రం తిప్పాడు. ఆయన సొంత పార్టీ కార్యకర్తల కంటే బయటి వారికే ఎక్కువ ఉపయోగ పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. వైసిపి నేతలను ఒంటి కాలిపై నిలబడి విమర్శలు చేసిన రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పుడు తెరమరుగయ్యారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు తో చీకటి వప్పందాలు ఉన్న కొందరికి రాష్ట్ర కార్పొరేషన్ పదవులు దక్కాయి. నగరానికి చెందిన ఆరుగురు నేతలకు రాష్ట్ర స్థాయి ఛైర్మన్ పదవులు ఉన్నా కరుణాకర్ రెడ్డిపై ఒక్క విమర్శ చేయడం లేదు. కొందరు అధికారం అడ్డు పెట్టుకుని భూ కబ్జాలు, తోపుడు బండ్ల వారి నుండి కూడా దందాలువసూలు చేస్తున్నారు. ఒక నాయకుడు తిరుమలలో అనధికార తట్టలు పెట్టించి వసూళ్ల చేసుకుంటున్నారు. నియోజక వర్గం ఇంచార్జి సుగుణమ్మకు రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పదవి ఇచ్చినా పార్టీని సక్రమంగా నడపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ పార్లమెంటు అధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి నరసింహ యాదవ్ ఒక వర్గానికి పరిమితం అయ్యారని పార్టీలో కార్యకర్తలే వాపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే మబ్బురామిరెడ్డి కుమారుడు దేవ నారాయణరెడ్డి ఉనికి కోసం తపిస్తున్నారు. టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడుపై కరుణాకర్ రెడ్డి చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టే నాయకుడే కనిపించడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూడా పూర్తి స్థాయిలో సఫలం కాలేక పోతున్నారు. సి ఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ వచ్చినపుడు పోటీ పడి ఫోటోలు తీసుకుని ప్రచారం చేయడంలో మాత్రం ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారనేది కార్యకర్తల ఆవేదన. తిరుపతి పార్టీ నిర్మాణంపై అధిష్టానం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

## విజిలెన్స్ దాడులు... 88 సిలిండర్లు స్వాధీనం



విజిలెన్స్ శాఖచే షాపుపై దాడి చేసిన అధికారులు

శ్రీకాళహస్తి,మార్చి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో విజిలెన్స్ ప్రత్యేక స్క్వాడ్ శుక్రవారం ఆకస్మిక దాడి చేసి అక్రమంగా విక్రయిస్తున్న 88 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తిరుపతి విజిలెన్స్ ఎస్ పి.కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేసారు. శ్రీరామనగర్ కాలనీ లోని ఓ కిరాణ దుకాణంలో బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు జరిపామన్నారు. శ్రీరామనగర్ కాలనీలోని శివగణేష్ ప్రోవిజన్స్ స్టోర్స్ లో దాడులు జరిపినట్లు సిఐ వివరించారు.ఇక్కడ రికార్డులను పరిశీలించిన మీదట 88 సిలిండర్లు అక్రమంగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ దాడుల్లో సిఐ చంద్రశేఖర్‌తో పాటు శ్రీకాళహస్తి టౌన్ సిఐ ప్రకాష్‌కుమార్, ఎస్ఐ మునెమ్మ, కానిస్టేబుల్స్ కన్నయ్య, వెంకటాద్రి లు పాల్గొన్నారు.

**ఆ వ్యాపారికి ఇదే వ్యాపారం:**
శ్రీకాళహస్తిలోని బైపాస్ సమీపంలోని శివగణేష్ కిరాణ షాపుయజమాని నాగమణి ఎంతో కాలంగా ఖాళీ సిలిండర్లకు గ్యాస్ నింపే వ్యాపారం చేసే వారు. పట్టణంలోని ఎవరైనా గ్యాస్ లేదన్నా, అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వ్యాపారులు కూడా రిటైల్‌గా ఇక్కడ గ్యాస్‌ను నింపుకునే వారు. దాంతో విజిలెన్స్ సిఐ సారథ్యంలో దాడులు జరిపినట్లు సమాచారం,

## బాబు వస్తేనే జాబులును నిజం చేస్తున్నాం

**- మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్ - నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్**



నగరి, మార్చి 20 ప్రభాతవార్త నగరి బాబుతోనే జాబు గ్యారంటీ అనే నినాదాన్ని నిజం చేస్తున్నామని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తెలిపారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతను జగన్ మోసం చేస్తే, టీచర్, పోలీసు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి మంత్రి నారా లోకేశ్ మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యో గాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్పష్టంచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం చేశామని, ఉగాది సందర్భంగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కోసం దివ్యాంగుల శక్తి పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు, పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణం ఇలా అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

**- మాట నిలబెట్టుకున్న లోకేష్**
ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నారా లోకేష్ నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. 10,060 ఉద్యోగాల భర్తీకి ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. ఇది రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు శుభవార్తని అన్నారు. అధికారంలోకి రాగానే 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. జగన్ సహా వైసీపీ నాయకులు కోర్టుల్లో ఎన్ని కేసులు వేసినా, వాటిన్నింటినీ అధిగమించి మెగా డీఎస్సీ నిర్వహించారని మంత్రి నారా లోకేష్‌ను కొనియాడారు. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బాబుతోనే జాబ్ గ్యారంటీని అనే నినాదాన్ని మాటలతో సరిపెట్టకుండా నిజం చేస్తున్నామన్నారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ నిరుద్యోగ యువతను జగన్ మోసం చేశారని మండిపడ్డారు.

## కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా...
## ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు : ఎమ్మెల్యే



హెచ్‌పివి వ్యాక్సిన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వెంకటగిరి మార్చి 20 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ ఆసుపత్రులు కన్నా దీటుగా వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌పివి వ్యాక్సిన్‌ను 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థులకు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అర్హత కలిగిన వైద్యులు ఉన్నారని తెలిపారు. హెచ్ పి వి వ్యాక్సిన్ వేసుకున్నందువల్ల మహిళలకు గర్భకోశ క్యాన్సర్ వ్యాధి రాదని తెలిపారు. 5000 రూపాయలు విలువ గలిగిన వివక్షను ప్రభుత్వ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో 3,500 మందికి ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి రెండు కళ్ళుగా పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇంకా 250 వ్యాక్సిన్స్‌పైన అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సాయి, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ పట్టణ అధ్యక్షులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకలివేస్తే వంట చేసుకోవాలి... గంట మోగితే తరగతి గదుల్లోకి పరుగేత్తాలి!

**-ప్రిన్సిపాల్ గొడవతో వెళ్ళిపోయిన వంట వాళ్ళు**



విద్యార్థులు వంట చేసుకుంటున్న దృశ్యం

రైల్వే కోడూరు, మార్చి 20 ప్రభాతవార్త: ఎ.పి.గురుకులాలు అంటే గొప్ప నాణ్యమైన విద్యకు నిదర్శనం. ఈ గురుకులాల్లో సీటు సంపాదించాలన్న అంత సులభం కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంట్రెన్స్ నిర్వహించి, మెరిట్ ప్రకారం అడ్మిషన్ చేసుకుంటారు. ఈ గురుకుల పాఠశాలలో అన్ని కులాల విద్యార్థులుకు ఎంట్రెన్స్ మెరిట్ ద్వారా ప్రవేశం ఉంటుంది. ఈ పాఠశాలలో సీటు దక్కితే వారి భవిష్యత్ గురించి పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలోనే అత్యంత నాణ్యమైన ఉన్నత విద్యను అందించే విద్యాలయాల్లో ఏపీ గురుకుల విద్యాలయాలు ప్రథమంగా ఉండేటివి. ఈ విద్యాలయాల్లో క్వాలిటీ విద్యతో పాటు క్వాలిటీ భోజనాలు కూడా అందించడం అనేది జరుగుతుంది. ఏపీ గురుకులాలు అంటే ఆ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని వసతులు నాలుగు గోడల మధ్య జరిగేవి. అలాంటి గురుకులాలు నేడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. అక్కడ పిల్లలకు సక్రమమైన వసతులు లేకపోవడమే కాకుండా నాణ్యమైన విద్య కూడా సన్నగిల్లినట్టు తెలుస్తుంది. మరి దారుణమైన విషయానికి వస్తే ఆకలి వేస్తే వంట చేసుకుని, గంట మ్రోగితే పరుగు పరుగున తిని తినక,పుస్తులతో తరగతి గదులకు వెళుతూ అత్యంత దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న గురుకుల పాఠశాలల్లో నాడు కడప, నిన్న అన్నమయ్య, నేడు తిరుపతి జిల్లాకు చేరిన రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ముక్కావారిపల్లె ఏపీ ఆర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థుల పరిస్థితి. గత మూడు రోజులుగా దయనీయంగా తయారయింది. వీరికి ఆకలేస్తే పొట్టకూటి కోసం చదువులు కూడా వదిలేసి కాళ్లు, చేతులు కాల్చుకుని వంట చేసుకుని తినే పరిస్థితి దీని అంతటికి ఆ పాఠశాల ప్రధానమైన ప్రిన్సిపల్ విద్యార్థులకు అన్ని వసతుల పట్ల ఆలన పాలన చూడాల్సింది, అక్కడున్న రోజువారి కూలీలైన వంట మనుషులపై దొంగతనం నేపంవేసి వారిని ఎగనామం పెట్టే పరిస్థితి తీసుకొచ్చారు. దీంతో గత మూడు రోజుల నుంచి ముక్క వారి పల్లె గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒకవైపు 10వ తరగతి పరీక్షలు మరోవైపు ఆకలి కేకలతో వంట వార్పుల పనులు పరీక్షల సమయంలో చదువుకుంటే ఆకలి తీరదు, ఆకలి తీరితే పరీక్షలకు చదువుకోలేని పరిస్థితి. గత మూడు రోజుల నుంచి ఉదయం పూట టిఫిన్లు లేకుండానే పరీక్షలు రాసి మధ్యాహ్నం 12 గంటల తరువాత వంట చేసుకుని ఆ విద్యార్థులు తినే పరిస్థితి. ఈ విషయమై ప్రభాతవార్త ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా పాఠశాలలో పనిచేసే వంట వాళ్ళు నిత్యవసర సరుకులు దొంగలించడంతో వారిని మందలించడం జరిగిందన్నారు. దీంతో వారు గత మూడు రోజులుగా ఎగనామం పెట్టడంతో పిల్లలే వండుకుని తినే పరిస్థితి దాపురించిందన్నారు. ఎగనామం పెట్టిన వంటమనుషులను కూడా పిలిచి మాట్లాడతామని తెలిపారు.

## ఏరులై పారుతున్న నాసిరకం మద్యం!

**-బ్లాక్ లో అధిక ధరలకు విక్రయం..!**
**-సమయానికి ముందే ప్రభుత్వ దుకాణాలు మూత**



తొట్టంబేడు మార్చి 20 ప్రభాతవార్త : సామాన్యుని వ్యసనంతో ప్రభుత్వం వ్యాపారం సాగిస్తుంది.ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పరిపాలనకు మద్యం రాబడే ప్రధానంగా మారింది. అయితే మద్యంకు బానిసలైన జనం పగలంతా కష్టపడి, రెక్కలు ముక్కలు చేసి సంపాదించిన కూలి డబ్బులు సాయంత్రం అయితే మద్యం షాపులకు ధారబోస్తూ అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. నిరుపేదల కుటుంబాల నిర్వహణ మద్యంతో కకావికలమౌతున్నాయి. అనారోగ్యంతో ఆసుపత్రికి వెళితే ఇంట్లో వస్తువులు తాకట్టుపెట్టుకునే దుస్థితి చోటు చేసుకుంది.ఓ వైపు ప్రభుత్వ మద్యం రెట్లకు తోడు నాసిరకం మద్యం రాజ్యమేలుతుంది.
తొట్టంబేడు మండలంలో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని మందు బాబులు గగ్గోలు పెడుతున్నారు. కాళహస్తికి కూత వేటు దూరంలో తొట్టంబేడు మండలం ఉంది. ఈ మండలంలో 27 పంచాయతీలు ఉన్నాయి. ఈ మేరకు శ్రీకాళహస్తిలో ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లే దారిలో తంగేళ్లపాలెం మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే ఎంజీఎం ఆసుపత్రి ముందరే ఓ మద్యం దుకాణం నిర్ణీత సమయం కంటే ముందే దుకాణాలు మూసి మద్యం ను అధిక ధరలకు అమ్ముతున్నట్టు మందు బాబులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యాన్ని విక్రయించు కునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. బీరు బాటిల్లపై ఎమ్మార్పీ ధర కంటే 50 నుంచి వంద రూపాయల మధ్యలో అమ్ముతు మందు బాబుల జేబులకు చిల్లులు వేస్తున్నారు. అంతేకాకుండా అక్రమ మద్యం విచ్చలవిడిగా సరఫరా చేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం సిండికేట్లకు నాయకుడుగా ఉన్న రాజకీయ కీయ నాయకుడికి తెలియనిదా ఇదంతా అని జనం చర్చించుకుంటున్నారు. దీనిపై పత్రికల్లో వెలువడిన రాజకీయ నాయకులు, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అలాగే మండలంలో కొన్ని గ్రామీణ ప్రాంతాల వద్ద గుడారాలు ఏర్పాటు చేసుకొని నకిలీ మద్యాన్ని తయారుచేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే ఇదంతా టిడిపి నేతల పని అని కొంతమంది చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం సేవించి ఎంతోమంది మందుబాబులు అనారోగ్య సమస్యలతో సతమతమై,మరి కొంతమంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి అన్న విషయం అందరికీ తెలిసిందే. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా కల్తీ లేని మందు, ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తారు అనుకుంటే ఈ ప్రభుత్వంలో కూడా ప్రీమియం బ్రాండ్లు ఫారెన్ లిక్కర్ల ధరలతో ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు ఉన్నారా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ఇక్కడ ఉన్న మద్యం దుకాణాలు తొందరగా మూసివేసి బెల్ట్ షాపులను రాత్రంతా కొనసాగిస్తున్నారు. దీంతో శ్రీకాళహస్తి తొట్టంబేడు మండల ప్రాంతాల్లో మద్యానికి కరువన్న బాదే లేనట్టుగా ఉంది. కొన్ని హైవే ప్రాంతాల్లో గుట్టు చప్పుడు మద్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నా దాఖలాలు ఉన్నాయి. నకిలీ మద్యం గ్రామీణ ప్రాంత వాసులు సేవించడం వల్ల అనారోగ్య పాలై,ఆస్తులు అమ్మి ఆసుపత్రి వారికి సేవ చేసినట్టు మహిళలు ఆవేదన చెందుతున్నారు. అసలు నకిలీ మద్యం గుర్తించడానికి వీలు లేకుండా ఎలా తయారు చేస్తున్నారు ఏంటన్న అసలు తలెత్తుతున్నాయి. అయితే ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు ఇంతవరకు దీనిపై దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇతర రాష్ట్రాలకు పోలిస్తే మన రాష్ట్ర వ్యత్యాసం ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. ఈ నాసిరికం మద్యంతో బెంబేలెత్తున్న మందుబాబులు పక్క రాష్ట్రాల వైపు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించాలని మందుబాబులు కోరుతున్నారు.

## మున్సిపాల్టీ స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీఓ భవాని

పలమనేరు, మార్చి 20 ప్రభాతవార్త:



పలమనేరు మున్సిపాల్టీ స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీఓ భవాని నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ఈ నెల 17 నుండి స్పెషల్ ఆఫీసర్ల పాలన అమలులోకి వచ్చింది. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ మున్సిపాల్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు, అధికారులను ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని అవసరమైన పనులు చేపడతామని వివరించారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. అంతకు ముందు వేద పండితుల మంత్రోచ్చారణలతో కమీషనర్ ఎంవి రమణారెడ్డితో పాటు పలువురు అధికారులు తెలుగుదేశం నాయకులు పుష్పగుచ్చాలు సమర్పించి స్పెషల్ ఆఫీసర్‌కు స్వాగతం పలికారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, మార్చి 20 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తురాలు శుక్రవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్ రంగారెడ్డికి చెందిన సుజాత అనే భక్తురాలు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

కాణిపాకం, మార్చి 20 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని పలువురు ప్రముఖులు శుక్రవారం కుటుంబసమేతంగా



వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈమేరకు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడల్, కేంద్ర విద్యుత్ మరియు సహజవాయువుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీకాంత్ నాగులపల్లి, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపకశాఖ డీజీ ఐపి.వెంకట రమణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమీషనర్ శరత్ చంద్ర కళ్యాణ్ చక్రవర్తిలు వేర్వేరుగా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవితదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయండి

–ఉపాధి హామీ రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్

తవణంపల్లె, మార్చి 20 ప్రభాతవార్త:

అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్దగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయ




సమగ్రాభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉపాధి హామీ పథకం రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ఆదేశించారు. శుక్రవారం అర్దగిరి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఆయన ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, ఆలయ అధికారులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అసందర్భంగా దేవస్థానం వద్ద చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి పరిశీలించారు. అనంతరం ఆలయ ఛైర్మన్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం వద్ద క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈమేరకు దేవస్థానం పరిధిలోని కొండ చుట్టూ, పైభాగ ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని గోపీచంద్ చూచించారు. ఇందుకోసం టూరిజం, ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, రెవెన్యూ తదితర శాఖలు దేవాదాయశాఖతో సమన్వయం చేసుకుని ఆలయ అభివృద్ధికి సమగ్ర నివేధిక సిద్ధం చేయాలని గోపిచంద్ సూచించారు. ఈకార్యక్రమంలో డ్వామా పీడీ అవసాని రవికుమార్, అదనపు పథక సంచాలకులు మల్లిఖార్జున, ఏపీడీలు సుబ్రమణ్యం, శ్రీనివాసులు, ఏపీఓ బాల, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గడ్డి లారీలో ఎగసిపడిన మంటలు

**వెదురుకుప్పం, మార్చి 20 ప్రభాతవార్త** : మండలంలోని దామరకుప్పం రైస్‌మిల్లు వద్ద శుక్రవారం సాయంత్రం ఎండు గడ్డి తీసుకువస్తున్న లారీ నుంచి మంటలు ఎగసిపడటంతో ప్రమాదం సంభవించిన్నట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... ఎండు గడ్డి విక్రయించడంకు తీసుకువస్తున్న లారీ నుంచి పెద్ద స్థాయిలో మంటలు ఎగసిపడట్టంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరిగింది. పెద్ద స్థాయిలో పంటలు ఎగసిపడటంతో చవటగుంట, పచ్చికాపల్లం వైపు వెళ్ళు వాహనాలు భారీగా అగిపోయాయి. ఐతే లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహారించిన పండుతున్న లారీని ప్రక్కనే ఉన్న భూముల్లోకి తీసుకువెళ్ళడంతో రాకపోకలకు అంతరాయం లేకుండా పోవడంతో ఊరిపిల్చుకున్నారు. కాగా పెద్ద స్థాయిలో మంటలు ఎగసిపడటంతో పోగ కమ్ముకుంది. దీంతో వాహనలు ఆగిపోయన్నారు. కాగా ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. లారీ నుంచి మాత్రం పెద్ద స్థాయిలో మంటలు ఎగసిపడుతూనే ఉన్నాయి. ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు.



ఫోటో :

## ఉగాది కానుకగా యువతకు జాబ్ క్యాలెండర్

– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరురూరల్, మార్చి 20 ప్రభాతవార్త:



ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు యువతకు ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందులో భాగంగా ఉగాది కానుకగా ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. గత వైకాపా పాలనలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని, కమీషన్ల కోసం కంపెనీలను తరిమేసి యువత భవిష్యత్తు నాశనం చేసారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాకా యువతకు అండగా నిలుస్తూ ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు యువతకు అండగా నిలుస్తూ తన బ్రాండ్ ఇమేజ్ ద్వారా భారీగా కంపెనీలను తెచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుండగా, రాష్ట్ర విద్యా, ఐటిశాఖ మంత్రి లోకేష్ పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారని తెలిపారు.

## బంగారు కుటుంబానికి ఆర్థిక భరోసా

రామకుప్పం, మార్చి 19ప్రభాతవార్త:




పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బంగారు కుటుంబం ఎంపికతో ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గిడ్డపల్లి గ్రామానికి చెందిన లావణ్య, శివకుమార్ కుటుంబానికి పి ఫోర్ ద్వారా 80 వేల రూపాయలను అందించి కిరాణా షాప్ ఏర్పాటు చేసుకున్నారు. మెగా ఇంజనీరింగ్ ద్వారా తమకు ఆర్థిక సహాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ మునిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రవిరెడ్డి, వేసుకో డైరెక్టర్ సతీష్, బూత్ ఇంచార్జ్ బాలసుబ్రమణ్యం, నేతలు పెరుమాళ్, మురళి, మురళీమోహన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రంగనాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ బాబు, సుధాకర్‌రెడ్డి, జయరాం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీ నిలుపుకున్న మంత్రి లోకేష్ : గౌనివారి

శాంతిపురం, మార్చి 20 ప్రభాతవార్త:



తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీను మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకున్నారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉగాది పర్వదినాన అద్భుతమైన కానుకను అందించారన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 10,060 పోస్టులతో కూడిన భారీ ఖిజాబ్ క్యాలెండర్‌ఖిను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ క్యాలెండర్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పక్కా ప్రణాళికతో భర్తీ చేయనున్నారన్నారు. విశ్వవిద్యాల యాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి కూడా ప్రత్యేక ప్రకటన చేయడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయనున్నారన్నారు. ఈ నియామక ప్రక్రియ సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మరింత వేగవంతం కానుందన్నారు. సెప్టెంబర్ 15న 750 గ్రూప్ 2 పోస్టులు, 503 ఏఈఈ పోస్టులతో పాటు మరో 506 ఇతర విభాగాల పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారన్నారు. అక్టోబర్ 15న పాఠశాల మరియు ఇంటర్ విద్యకు సంబంధించి 3,004 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. మాట ఇచ్చాం, అమలు చేశాం అనే నినాదంతో, కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల కలలను నిజం చేస్తూ భవిష్యత్తుకు బలమైన పునాది వేసిందన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా వేల పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఈ జాబ్ క్యాలెండర్ ద్వారా యువతకు ఉపాధి విప్లవాన్ని పరిచయం చేస్తోందన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పట్ల రాష్ట్రంలోని నిరుద్యోగుల తరఫున సిఎం చంద్రబాబుకు, డిసిఎం పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పలమనేరు మాజీ ఎమ్మెల్యే టిసి రాజన్ మృతి

పలమనేరు, మార్చి 20 ప్రభాతవార్త:



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక వృద్ధుడు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే టిసి రాజన్ (107) గుండెపోటుతో మృతిచెందారు. అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చేరిన ఈయన గుండెపోటు తీవ్రం కావడంతో శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. సాయంత్రం భౌతిక కాయం పలమనేరులో ఆయన నివాసానికి చేరుకుంది. 1919లో జన్మించిన ఈయన మహాత్మా గాంధీ పిలుపుమేరకు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంతో పాటు అనేక ఉద్యమాలు చేసి జైలుకు కూడా వెళ్ళారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్‌పార్టీలో కొనసాగుతూ పార్టీకి సేవలందించారు. 1967లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్టు ఆశించారు. ఐతే అధిష్టానం అంగీకరించక పోవడంతో ఆ పార్టీకి రాజీనామా చేసి ఎన్‌జి రంగా స్థాపించిన స్వతంత్ర పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బెల్లం శ్రీనివాసులు నాయుడుపై సుమారు 15 వేల ఓట్ల పైగా మెజార్టీతో విజయం సాధించారు. అప్పటి చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్‌జి రంగా పోటీచేసి గెలుపొందారు. 1972 వరకు ఎమ్మెల్యేగా ఉన్న ఈయన తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలమనేరు నుండి రెండో సారి పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎం రత్నం చేతిలో ఓటమి చెందారు. అప్పటి నుండి రాజకీయాలకు దూరంగా వుంటూ వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. ఈయనకు భార్య ముగ్గురు కూమారులు, ఒక కుమార్తె ఉండగా 10 ఏళ్ళ క్రితం భార్య మృతిచెందారు. ఇక ముగ్గురు కుమారుల్లో ఒక కుమారుడు రెండేళ్ళ క్రితం బెంగళూరులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు కుమారుల్లో పెద్దకుమారుడు మేఘనాథం పలమనేరులో వ్యాపారం చేసుకుంటూ ఇంటి వద్ద తండ్రి ఆలనాపాలనా చూస్తున్నాడు. మరో కుమారుడు సంజయ్ ప్రొఫెసర్‌గా ఉంటూ పదవీ విరమణ చెంది బెంగళూరులో స్థిరపడ్డారు. ఉన్న ఒక కుమార్తె సునీత అల్లుడు కూడా బెంగళూరులో నివాసముంటూ స్థిరపడ్డారు. భౌతిక కాయం పలమనేరుకు రావడంతో పట్టణ ప్రముఖులు సన్నిహితులు విచ్చేసి నివాళలర్పించారు. ఈ నెల 20న శనివారం మధ్యాహ్నం 12 గంటల పైన పలమనేరులో దహనక్రియలు ఉంటాయని ఆయన కుమారుడు మేఘనాథం తెలిపారు.

## అర్దగిరి సన్నిధిలో రాష్ట్రష సమాచార కమీషనర్

**తవణంపల్లె, మార్చి 20 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్దగిరి శ్రీవీరాంజనేయస్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమీషనర్ శరత్ చంద్ర కళ్యాణ్ చక్రవర్తి కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చకులు మండపంలో ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, సంజీవరాయిని పుష్కరిణి తీర్థాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు,

## మైనార్టీల సంక్షేమంకు సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త:



రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమం కోసం సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లానూరులో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పది లక్షలతో నిర్మించిన ముస్లిం స్మశాన వాటిక నూతన ప్రహరీగోడను శుక్రవారం ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పికెఎం ఉడాఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, తదితరులు ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ రమజాన్ మాసం సందర్భంగా ఇమామ్, మౌజన్లకు సిఎం చంద్రబాబునాయుడు 45కోట్ల గౌరవ వేతనాలను మంజూరు చేశారన్నారు. అన్నివర్గాలు, మతాలకు కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో మైనార్టీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారన్నారు. రాజధాని అమరావతిలో హజ్ హౌస్ నిర్మాణంకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇదివరకే ముస్లింల సంక్షేమం కోసం కార్పోరేషన్ రుణాలు, దుకాన్ మకాన్, షాదీతోఫా తదితర పథకాలు అమలు చేశారన్నారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మరింత అండగా నిలవాలని కోరారు. ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గత వైకాపా హయా ంలో స్మశాన వాటిక వైకాపా నేతల దౌర్జన్యానికి కూలిపోతే నూతనంగా మరలా నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యుడు రామచంద్ర, కనీసవేతనాల మండలి సభ్యుడు శరవణ, షాదీఖానా ఛైర్మన్ సర్దార్, మాజీ ఛైర్మన్ అన్సర్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, నేతలు చంద్రశేఖర్, విభూషణ్, దామోదర్, రమేష్, వెంకటా చలపతి నాయుడు, సంజీవరాజు, కనకరాజు, అన్నాదొరై, నాగార్జున, గుణశేఖర్, రాజ్‌కుమార్, ప్రకాష్, మోహన్, తిరుపతి పాల్గొన్నారు.

## నిల్వ వ్యర్థాలు వేరుచేయడం పూర్తి : కమీషనర్

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో స్వచ్ఛకుప్పం సాధనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన వ్యర్థాలను నియంత్రించి వాటి నిల్వలను వేరు చేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కుప్పం సమీపం లోని డంపింగ్ యార్డును పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు ఏళ్ల కాలంలో కుప్పం ప్రాంతంలో సుమారు 40వేల టన్నుల వ్యర్థాలను సేకరించి నియంత్రించినట్లు తెలిపారు. ప్రస్తుతం భారీ యంత్రాల సాయంతో వ్యర్థాలను వేరు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటికే 20వేల టన్నుల వ్యర్థాలను వేరు చేయడం జరిగిందన్నారు. మరో ఇరవై రోజుల్లో మిగతా ఇరవై వేల టన్నుల వ్యర్థాలను వేరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం వ వ్యర్థాలను దగ్ధం చేసేందుకు సిమెంట్ ఫ్యాక్టరీకి తరలిస్తామని పేర్కొన్నారు.




## సిఎం చంద్రబాబుకోసం ప్రత్యేక దువా కార్యక్రమం

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త :



సిఎం చంద్రబాబునాయుడు కోసం మండలంలోని మల్లానూరులో ముస్లిం మతగురువుల అధ్వర్యంలో తెదేపా నేతలు, మైనార్టీ సోదరులు ప్రత్యేక దువా కార్యక్రమం నిర్వహించారు. సిఎం చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉ ంటూ రాష్ట్రాన్ని మరి ంత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయనకు భగవంతుడు మరింత శక్తి ఇవ్వాలని మత గురువులు దువాలో కోరారు. రాష్ట్ర ప్రజలు మరింత సుఖసంతోషాలతో ఉండేలా మరింత సుపరిపాలన అందించేలా చూడాలని ప్రార్థించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, షాదీఖానా ఛైర్మన్ సర్దార్, మాజీ ఛైర్మన్ అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డిని కలసిన మున్సిపల్ కౌన్సిలర్లు

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త:



కుప్పం మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు శుక్రవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ వైకాపా అధ్యక్షుడు, కౌన్సిలర్ హాఫీజ్, కౌన్సిలర్లు మోహన్‌రాం, విజయ్ తదితరులు పెద్ది రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా కుప్పంలో రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు వారు తెలిపారు.

## రమజాన్ మాసంలో జకాత్...ఫిత్రా తప్పనిసరి

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త :

రమజాన్ మాసంలో ముస్లిం సోదరులు జకాత్, ఫిత్రాల దానం చేయడం తప్పనిసరి అని మత గురువులు పేర్కొన్నారు. రమజాన్ మాసంలో ఐదవ శుక్రవారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద ముస్లిం సంతోష ంగా ప ండగ జరుపుకునేందుకు అల్లాహ్ జకాత్, ఫిత్రాలను తప్పనిసరి చేశారన్నారు. వీటిని సంపన్నులు పేదలకు అందజేస్తే వారు కూడా పండగను సుఖసంతోషాలతో జరుపుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈద్ ప్రార్థనలకు ముందే వీటిని చెల్లించాలని సూచించారు. రమజాన్ మాసం తరహాలోనే రోజుకు ఐదు పూజల నమాజులు చదవడం, సన్మార్గంలో పయనించడం, దివ్యగ్రంథం ఖురాన్‌లో పేర్కొన్న రీతిలో సత్ ప్రవర్తనతో మెలగడం అలవర్చుకోవాలన్నారు. దాన ధర్మాలకు ప్రతీక రమజాన్ మాసం అన్నారు.

## నేడు రమజాన్ పర్వదినం

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త:

ముస్లిం సోదరుల పవిత్ర రమజాన్ పర్వదినం శనివారం జరుపుకోనున్నారు. శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనం ఇవ్వడంతో రమజాన్ మాసం ముగిసి షవ్వాల్ నెల ఆర ంభం కానుండడంతో పండగను జరుపుకుంటారు. శనివారం ఉదయం 9గంటలనుంచే ఈదా ్గల వద్ద ఈద్ ప్రార్థనలు ప్రారంభం అవుతాయని మతగురువులు తెలిపారు. ముసి ్లం సోదరులు పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## కైలాస ధామం కమిటీ కార్యదర్శి రూ.3 లక్షలు విరాళం

-రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు విశిష్ట సేవలు

**చంద్రగిరి, మార్చి 20 (ప్రభాతవార్త):** చారిత్రాత్మక చంద్రగిరిలో ప్రజాహిత కార్యక్రమం కైలాస ధామం



కమిటీ కార్యదర్శి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు శుక్రవారం రూ.3 లక్షలు విరాళం అందజేసినట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. కైలాస ధామం పనులను ఎంఎల్ఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజినీర్ రాజుగారి మనోహర్ రెడ్డి పనుల పురోగతిని వివరించారు. కైలాస్ ధామం నిర్మాణ ప్రక్రియ ప్రారంభ దశలో దశలవారీగా రూ.10 లక్షల విరాళం ప్రకటించినట్లు తెలిపారు. ఇందులో మొదటి విడతలో రూ.3 లక్షలు, రెండవ విడతలో రూ.3 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. మరో విడతలో రూ.4 లక్షలు చెల్లించనున్నట్లు తెలిపారు. కైలాస ధామం నిర్మాణ ప్రక్రియలో నాగరాజు నాయుడు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూ విశిష్ట సేవలందిస్తున్నట్లు అభినందించారు.

## ఆలయంలో లలిత సహస్రనామ పారాయణం

-ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి



**చంద్రగిరి, మార్చి 20 (ప్రభాతవార్త):** శ్రీ మిట్టగంగమ్మ ఆలయంలో శుక్రవారం శ్రీలలిత సహస్ర నామ పారాయణం ముగింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడంతో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీ మిట్టగంగమ్మ అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం నిత్యపూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు లలిత మూలమంత్ర సహస్రనామ హోమం కన్నుల పండువగా నిర్వహించినట్లు తెలిపారు. పూసల గౌరమ్మ ఆధ్వర్యంలోని బృందం 1008 సార్లు లలిత పారాయణం క్రతువును మహాసంకల్పంగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్బు లలిత సహస్రనామంలో అమ్మవారికి "నామపారాయణ ప్రీతి" అనే నామం వున్నట్లు వివరించారు. అమ్మవారి నామాన్ని నిరంతర పారాయణం చేయడం ద్వారా సకలశుభాలు కలుగుతాయన్నారు. 9 రోజుల పాటు నిర్వహించిన లలిత పారాయణంలో, మూలమంత్ర హోమం కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నట్లు తెలిపారు.

## విషువత్ ఛాయా పరిశీలన కార్యక్రమం

తిరుపతి విద్య, మార్చి 20 (ప్రభాతవార్త):



జాతీయ సంస్కృత వర్సిటీ లో జ్యోతిష విభాగం ఆధ్వర్యంలో విషువత్ ఛాయ (ఈక్వినాక్స్ షాడో) పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో ఖగోళ శాస్త్రంపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సంవత్సరంలో సూర్యుడు భూమధ్యరేఖను రెండుసార్లు దాటుతాడని, అవి మార్చి 20 మరియు సెప్టెంబర్ 22 తేదీలలో సంభవిస్తాయని వివరించారు. ఈ రోజుల్లో సూర్యుడు భూమధ్యరేఖకు నేరుగా పైన ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా పగలు,రాత్రి సమయాలు సమానంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తర అక్షాంశ ప్రాంతాల్లో మధ్యాహ్న సమయంలో నీడ ఉత్తరం వైపు లంబంగా పడటం ఈ రోజుకు ప్రత్యేక లక్షణమని తెలిపారు. ఈ నీడను ఖగోళ శాస్త్రంలో"విషువత్ ఛాయా"గా పిలుస్తారు.ఈ సందర్భంగా జ్యోతిష విభాగానికి చెందిన సీనియర్ అధ్యాపకులు ప్రొఫెసర్ రాధాకాంత్ ఠాకూర్ పల్చ్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ కృష్ణేశ్వర్ ఝా,డా.చిత్రరంజన్ నాయక్ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె. వెంకట నారాయణరావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, జ్యోతిష అండ్ వాస్తు విభాగాధిపతి ప్రొఫెసర్ కృష్ణేశ్వర్ ఝా వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు వాయిదా.. కొత్త తేదీ విడుదల

తిరుపతి విద్య, మార్చి 20 (ప్రభాతవార్త):

ఎస్వీయూ పరిధిలో జరుగుతున్న యూజీ ఇయర్ ప్యాటర్న్ పరీక్షల షెడ్యూల్లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. రంజాన్ పండుగను దృష్టిలో ఉంచుకుని శనివారం నిర్వహించాల్సిన పరీక్షలను వచ్చే నెల 6వ తేదీకి వాయిదా వేశారు.అలాగే, యూజీ నాల్గో మరియు ఆరవ సెమిస్టర్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు పరీక్ష ఫీజులు చెల్లించాలని సూచించారు. ఆలస్యంగా చెల్లించేవారికి రూ.1000 అపరాధ రుసుముతో ఈ నెల 28 వరకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.

## 22న ఉచిత ఈఏపీసెట్ మాక్ టెస్ట్

తిరుపతి విద్య, మార్చి 20 (ప్రభాతవార్త):

ఇంజనీరింగ్, అగ్రికల్చర్ , ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈఏపీసెట్ 2026 పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం తిరుపతిలోని శ్రీ గగన కోచింగ్ సెంటర్ ఉచిత మాక్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం 9:00 గంటలకు ఈ నమూనా పరీక్ష జరగనుందని సంస్థ డైరెక్టర్ కరుణామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.భవానీ నగర్, రాజన్న పార్క్ సమీపంలో ఉన్న శ్రీ గగన కోచింగ్ సెంటర్ వేదికగా ఈ పరీక్ష నిర్వహించబడుతుంది. అసలు పరీక్షా వాతావరణాన్ని విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, వారి ప్రతిభా పాటవాలను అంచనా వేసేవడానికి ఈ మాక్ టెస్ట్ ఎంతగానో దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మాక్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నెల రోజుల పాటు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ ప్రకటించారు. ఆసక్తి గల విద్యార్థులు 9553590099 లేదా 9014052757 నంబర్లకు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. తిరుపతి మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ వాయిదా

తిరుపతి విద్య, మార్చి 20 (ప్రభాతవార్త):

రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిన నేపథ్యంలో, శనివారం (మార్చి 21) తిరుపతిలోని ఎస్.వి. జూనియర్ కళాశాలలో జరగాల్సిన ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ వాయిదా పడింది. ఇంగ్లీష్, మ్యాథ్స్, తెలుగు, హిందీ, హిస్టరీ, ఎకనామిక్స్, తమిళ్ సబ్జెక్టులకు సంబంధించిన వాల్యూయేషన్ ఇప్పుడు ఈ నెల 22వ తేదీ ఆదివారానికి వాయిదా పడినట్లు తిరుపతి ఆర్ఐఓ ,డి ఐఈఓజి.రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన సబ్జెక్టులతో పాటు, ఫిజిక్స్ సబ్జెక్ట్ వాల్యూయేషన్ కూడా 22వ తేదీ నుండే ప్రారంభం కానుందని ఆయన వెల్లడించారు. ఈ సబ్జెక్టులకు సంబంధించి నియమించబడిన ఎగ్జామినర్స్, చీఫ్ ఎగ్జామినర్స్ అందరూ ఆదివారం ఉదయం తప్పని సరిగా విధులకు హాజరుకావాలని ఆర్ఐఓ ఆదేశించారు. ఈ మార్పును అధ్యాపకులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.



## రోజా వ్యాఖ్యలపై...ఆరణి ఫైర్

తిరుపతి విద్య మార్చి 20 ప్రభాతవాం:

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్రంగా స్పందించారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి రోజాకు లేదని ఆయన పేర్కొన్నారు. సనాతన ధర్మంపై రోజా చేసిన వ్యాఖ్యలు అనుచితమని ఆయన విమర్శించారు. పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా శ్రీవేంకటేశ్వర స్వామిపై విశ్వాసంతో డిక్లరేషన్ ఇచ్చి, తిరుమలలో మొక్కులు తీర్చుకున్నారని గుర్తు చేశారు. తరిగొండ వెంగమాంబ అన్నదానానికి సహకరించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీవారిపై విశ్వాసం ప్రకటించిన సందర్భాలపై ప్రశ్నలు లేవనెత్తారు. కుటుంబంతో కలిసి ఆలయాలకు వెళ్లిన సందర్భాలను వెల్లడించాలని రోజాను డిమాండ్ చేశారు.ఇతరులను విమర్శించే ముందు స్వీయ పరిశీలన అవసరమని ఆయన సూచించారు.

## ఒకటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

తిరుపతి విద్య మార్చి 20 ప్రభాతవార్త:

జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ సెకండ్ ఇయర్ తరగతులు ప్రారంభమవుతాయని ఆర్ ఐఓ జి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్లో 202526 విద్యాసంవత్సరం నుంచి నూతన సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేయడంలో భాగంగా సెంట్రల్ స్కూల్స్ విధానాన్ని ఇంటర్ బోర్డు అమలు చేస్తోందని తెలిపారు.

## జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

కేవీబీ పురం, మార్చి 20 ప్రభాతవార్త:




జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం జనసేన పార్టీ ఉద్యమం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేవీబీ పురం మండలం ఉపాధ్యక్షుడు పి.మోహన్ ఆధ్వర్యంలో అంజూరు, గుంటిపేడు, అంజూరుపాళెం, జేఎల్ పురం, సూరమాల, బ్రాహ్మణపల్లి, గురుకుల కండ్రిగ గ్రామాలల్లో జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు ఉద్యమం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీబీ పురం మండల ప్రధాన కార్యదర్శి వి.మునిశేఖర్, పి.తులసినాయుడు, రమేష్, చిరంజీవి, పి.ఖర్జురరావు, బి.కిషోర్, ఏ.వినోద్, గురుకుల కండ్రిగ గ్రామ ఇన్‌చార్జి లవకుమార్, వరదయ్య, మోహన్‌బాబు, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు వంట గ్యాస్ అందుబాటులో ఉంచండి : సీపీఎం

సత్యవేడు, మార్చి 20 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వంట గ్యాస్ అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి, సభ్యుడు దాసరి జనార్ధన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ గ్యాస్ కొరత లేదని ప్రకటిస్తున్నప్పటికీ ప్రజలకు గ్యాస్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లునాగలాపురం, సత్యవేడు, కేవీబీ పురం, వరదయ్యపాలెం, పిచ్చాటూరు, నారాయణవనం ఇలాంటి మండలాల్లో పత్రికల్లో వస్తున్న వార్తలను బట్టి తెలుస్తుందని జనార్ధన్ తెలిపారు. జిల్లా అధికారులు గ్యాస్ ఏజెన్సీలతో మాట్లాడి వంట గ్యాస్ ఇబ్బంది లేకుండా సకాలంలో సరఫరా చేసే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ ధరలను సిలిండర్ పై 60 రూపాయలు పెంచిన ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. అధికారులు స్పందించకపోతే గ్యాస్ గోడౌన్ వద్ద ప్రజలతో కలసి ఆందోళన చేస్తామని తెలిపారు.

## వడ్డేపల్లి నందు లేగదూడల ప్రదర్శన

పాకాల, మార్చి 20 ప్రభాతవార్త :



పాకాల మండలంలోని కే వడ్డేపల్లి పశువుల ఆసుపత్రి నందు లేగ దూడల ప్రదర్శన పిఎల్‌డిపి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 35 లేగదూడలను పశుపోషకులు తీసుకుని వచ్చారు. ఈ కార్యక్రమంలో మొదటి ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు బహుమతులు వచ్చిన రైతులకు బాగా పోషణ చేసి ఉన్నటువంటి లేగదూడలకు బహుమతులు ప్రధానం చేసారు. మిగిలిన దూడలు తీసుకుని వచ్చిన రైతులకు కూడా బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాకాల మండలం సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ హరీష్, సింగల్ విండో ఛైర్పర్సన్ క్రిష్ణమనేని సావిత్రి, గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన ప్రతి రైతుకు ఒక మినరల్ మిక్చర్, టిఫిన్ బాక్స్, ఒక లీటరు ఫీడ్ సప్లిమెంట్స్ అందించారు. ఒకటి, రెండు, మూడు బహుమతులు పొందినటు వంటి రైతులకు స్టీల్ పాల కాన్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాడి రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## గ్రావెల్ మాఫియా ఆగడాలను అరికట్టండి

- దుమ్ము దూళితో బత్తలవలం గ్రామం

**వరదయ్యపాలెం, మార్చి 20 ప్రభాతవార్త :** మండలం బత్తలవలం తమిళనాడులకు నిబంధనలకు విరుద్ధంగా రోజురోజున భారీ ఎత్తున గ్రావెల్ తరలింపు వ్యవహారం గ్రామాల్లో తీవ్ర ఉద్రికతలకు దారితీసింది. అధిక లోడ్లతో లారీలు అధిక సంఖ్యలో వందలాది ఎర్ర బంగారు లారీలు అతి వేగంతో దూసుకు వెళ్లడంతో గ్రామం మొత్తం దుమ్ము ధూళితో కూరుకుపోయింది. ఇళ్లల్లో సామాన్లు త్రాగునీరు, పంట పొలాలు, మహిళలు వృద్ధులు, తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పచ్చంగా ఉండాల్సిన పల్లె గ్రామాలు, ఎరుపు రంగుతో దృశ్యమిస్తుంది, ఈ పరిస్థితిని తట్టుకోలేక గ్రామ మహిళలు, గ్రామస్తులు నిరసనకు దిగగా, మట్టి ఒక గ్రామంలో తవ్వి, తమ గ్రామ మార్గాన్ని ఉపయోగించడం తీవ్ర అన్యాయం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గ్రావెల్ తరలిస్తున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తులకు మద్దతుగా నిలవాల్సింది పోయి గ్రావెల్ యజమానులకు వత్తాసు పలకడంతో, కొద్దిసేపు ఉద్రేత్తగా మారింది. పోలీసులు, లారీలు ఆపే హక్కు మీకు ఎక్కడుంది అంటూ పోలీసుల మాటలు గ్రామ సభకు కొద్దిగా బాధ కలిగించింది. గ్రామ పెద్దలు కలుగజేసుకుని సమస్యను పెద్దది కానీకుండా నిలిపారు. స్థానిక గ్రామస్తులు గ్రామ పెద్దలు గ్రావెల్ మాఫియాను అధికారులు కలగజేసుకొని పూర్తిగా నిలిపి వేయాలంటూ తెలియజేశారు.

## పూర్తి చేసుకున్న సీఎం కండ్రిగ-సూరికాపురం రోడ్డు

విజయపురం, మార్చి 20 ప్రభాతవార్త:




మండల పరిధిలో సీఎస్ కండ్రిగ-సూరికాపురం మట్టి రోడ్డు తారు రోడ్డుగా శరవేగంగా పూర్తి చేశారు. ఈ రోడ్డు ఎన్నో ఏళ్లుగా గుంతలమయంగా రాకపోకలు సాగించేందుకు సాధారణ ప్రజలే కాక వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యేవారు. స్థానిక టీడీపీ నాయకులు గజేంద్రనాయుడు, రఘుపతి నాయుడు, గాలి మురళీనాయుడు, తదితరులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కోటి రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులను మంజూరు చేయించారు. దీంతో నెల రోజుల్లో పూర్తి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే క్షూరికాపురం నుంచి చెంగమనాయుడు రోడ్డు నిర్మాణం పనులకు కోటి రూపాయలు నిధులు ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ రోడ్డు శరవేగంగా పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు గ్రామాల ప్రజలు తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి ఎంఎల్ఏ భూమిపూజ

చంద్రగిరి, మార్చి 20 ప్రభాతవార్త:

శ్రీ గుర్రప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి ఎంఎల్ఏ పులివర్తి నాని శుక్రవారం భూమి పూజ చేశారు.



చంద్రగిరి పాతపేటకు చెందిన ఉగ్రాణం, కాపువీధి, కామాటం, ఆరంబాకం, పట్రం కుటింబీకుల కులదైవం శ్రీగుర్రప్పస్వామి ఆలయం నివాసాల మధ్యన వుండటంతో పూజలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఎంఎల్ఏకి వివరించారు. తమకు ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమిని ప్రభుత్వం నుండి మంజూరు చేయించాలని ఎంఎల్ఏకి గతంలో విన్నవించుకున్నారు. ఆ మేరకు రెడ్డివీధికి సమీపంలోని నూకలగుంట వద్ద ఆలయ నిర్మాణానికి భూమిని మంజూరు చేశారు. సదరు భూమిలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడానికి విచ్చేసిన ఎంఎల్ఏకి ఆయా కుటుంబాల పెద్దలు ఎంఎల్ఏకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. భూమి మంజూరు చేయించడం పట్ల ఎంఎల్ఏకి కృతజ్ఞతలు తెలిపారు.

## పది మూల్యంకనంలో మార్పులు వద్దు

– రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:



టెన్త్ క్లాస్ మూల్యాంకన విధానంలో మార్పులు చేయడం తగదని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం టెన్త్ పరీక్షల నిర్వహణలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టడంతో పరీక్షల విధుల కేటాయింపులో గందరగోళం చోటు చేసుకుందని ఆయన మండి పడ్డారు. ఏప్రిల్ 4వ తేదీ నుండి ప్రారంభం కానున్న టెన్త్ మూల్యాంకన విధానంలో ట్యాబ్ ఆధారిత మార్కుల నమోదుకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం ఈ ప్రక్రియ నిర్వహణకు 30 లక్షల రూపాయల నిధులు కేటాయించిందని ఇది ప్రజాధనం దుర్వినియోగం అని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకుండా మార్కుల నమోదులో తప్పిదానికి భారీ జరిమానా నిబంధనలు విధించడం అధికారుల అవివేకంను నిదర్శనమన్నారు. సాంకేతిక సమస్యలు, సర్వర్ మొరాయించడం, సెల్ కవరేజ్ సరిగా లేకపోవడం తదితర సమస్యలు ఏర్పడినప్పుడు జరిమానా ఎవరికి విధించాలని ఆయన ప్రశ్నించారు. మార్కుల నమోదుకు రాత్రిళ్ళు వేచి వుండక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆరు సబ్జెక్టులను ఆరు స్పాట్ కేంద్రాల్లో అమలు చేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రయోగం సక్సెస్ అయితే రానున్న సంవత్సరంలో ఈ విధానంను రాష్ట్రం మొత్తం అమలు చేయాలని ఆయన సూచించారు.

## ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల

– జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:




ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉగాది పండుగ రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వెంకటేల సురేంద్రకుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి మాట్లాడుతూ గతంలో ఐదేళ్ళ పాటు రాష్ట్రంను పాలించిన వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎలాంటి ఉపాధి కల్పించకుండా యువతను దగా చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నాయకులు వెంకటేష్, భరత్‌చౌదరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లో మున్సిపల్ కౌంటర్లు పని చేస్తాయి : కమీషనర్



**చిత్తూరుహెల్త్, మార్చి 20 ప్రభాతవార్త:** ప్రభుత్వ సెలవులు, పండుగ రోజుల్లోను ఆస్తి పన్ను, కొళాయి పన్నుల చెల్లింపుకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పన్ను చెల్లింపు కౌంటర్లు పని చేస్తాయని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. నగర పురపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయని, ఆ మేరకు ఉద్యోగులకు షిఫ్ట్‌ల వారీగా నియమించడం జరిగిందన్నారు. ఆస్తి, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 31వ తేదీలోపు పన్నులు చెల్లించి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకారం అందించాలని కమీషనర్ కోరారు. పన్ను చెల్లింపుదారులు పన్నులను నగర పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, స్వర్ణ వార్డు సచివాలయాలతో పాటు ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించవచ్చునని కమీషనర్ తెలిపారు.

## చౌడేశ్వరి ఆలయంలో ఘనంగా పూజలు

వెదురుకుప్పం, మార్చి 20 ప్రభాతవార్త :



మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ రెంటాలచేనులో వేలసిన చౌడేశ్వరి ఆలయంలో ఘనంగా శుక్రవారం పూజలు నిర్వహించారు.శృంగేరి మఠం వేద పండితులు పవన్ మిట్టల్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన్నట్లు ఆలయ ధర్మకర్త సవిరెడ్డి కృష్ణ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆలయంను శుద్ధి చేసి ప్రత్యేకంగా అంకరణ చేసి అమ్మవారికి సుప్రభాత సేవ, వివిధ అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రలు, పూలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దైవదర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి సవిరెడ్డి చెన్నకేశవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సాయి కుమార్ రెడ్డిలు బంగారు మంగళసూత్రం వితరణ చేశారని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ధనంజేయులు రెడ్డి, పలువురు కార్యనిర్వాహక మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

వడమాలపేట, మార్చి 20 ప్రభాతవార్త:



వడమాలపేట మండలం తట్నేరి గ్రామంలో ఆరిమానుగంగమ్మ దేవాలయ నిర్మాణానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా నూతన దేవాలయం నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే తట్నేరికి విచ్చేయగానే గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్చం ఇచ్చి శాలువ కప్పి కర్పూర హారతులతో ఆయనకు నీరాజనం పలికారు. గ్రామంలో ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలతో ఆధ్యాత్మిక వాతావరణంలో కలకలాడింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఎన్‌డీయే కూటమి నాయకులు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ధనంజయలు నాయుడు, దాము యాదవ్, శివరాయల్, కుమార్, లక్ష్మిప్రసన్న, ఉదయ్, మురళి, రాధాకృష్ణ, చంద్రశేఖర్, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## పూల తోటలో శ్రీ పోలేరమ్మ పునఃనిర్మాణం



నాయుడుపేట, మార్చి 20 ప్రభాతవార్త: ఓజిలి మండలంలోని చిలమాను చేను పంచాయతీలో పూలతోట గిరిజన కాలనీలో శ్రీ పోలేరమ్మ గుడి చిన్నదిగా కొంత కాలం ఉండడంతో చిలమానుచేను వైసిపి నాయకుడు ఎల్లం రాజు రాంప్రసాద్ రాజు ఆధ్వర్యంలో శ్రీ పోలేరమ్మ ఆశీస్సులతో ఆయన పున నిర్మాణం చేపట్టడం జరిగింది. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు. తన తండ్రి అయినా ఎల్లం రాజు వెంకట కృష్ణంరాజు జ్ఞాపకార్థం కొరకు శ్రీ పోలేరమ్మ గుడిని ఉన్న నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం అరుణ రెడ్డి, మండల వైసిపి అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి, కొండూరు దామోదర్ రాజు, కొండూరు వెంకట సుబ్బరాజు, కొండూరు ప్రభాకర్ రాజు, బత్తిన సుబ్బారెడ్డి, మధు కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కారును ఢీ కొట్టిన లారీ



నాయుడుపేట, మార్చి 20 ప్రభాతవార్త: మండల పరిధిలోని అయ్యప్ప రెడ్డిపాలెం జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఒక భారీ లారీ బలంగా ఢీకొట్టడంతో, క్షణాల్లో కారు అదుపుతప్పి డివైడర్ పై పల్టీలు కొట్టి బోల్తా పడింది. నాయుడుపేట వైపు నుంచి పండ్లూరు వైపునకు ప్రశాంతంగా వెళుతున్న ఒక ప్రైవేట్ కారు, రహదారిపై ప్రయాణిస్తోంది. అదే సమయంలో, చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపునకు అతి వేగంగా వస్తున్న ఒక లారీ, కారు వెనుకనే వచ్చి ఎలాంటి హెచ్చరిక లేకుండా బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం, వెనుక భాగం పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ, ప్రయాణికులకు పెద్దగా గాయాలు కాకపోవడం ఊరటనిచ్చే విషయం. చికిత్స నిమిత్తం అంబులెన్సులో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రాథమిక చికిత్స అందించారు. వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనదారులు తమ ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలని, వేగ పరిమితిని పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ జరుగుతోంది.

## ముస్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఆర్డీఓ దేవేంద్రరెడ్డి



సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త: మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఆర్డీఓ దేవేంద్రరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం దేవేంద్రరెడ్డి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కమిషనర్ చిన్నయ్య, ఆర్ఓ నారాయణరెడ్డి, సిబ్బంది స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఆర్డీఓ దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి, మార్చి 20 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో యువతకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గడచిన 20 నెలల కాలంలో రాష్ట్రంలో ఏకంగా 6,28,347 ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇందులో భాగంగా 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా ఈ ఉగాది కానుకగా నిరుద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించిందని, ఇందులో పలు కీలక విభాగాల్లో పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా అన్ని ఉద్యోగాలను ఈ ప్రభుత్వమే భర్తీ చేసి తీరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## నేర నియంత్రణకు నడుంబించాలి : సీఐ



నాయుడుపేట, మార్చి 20 ప్రభాతవార్త: విద్యార్థులు నేర నియంత్రణకు నడుంబించాలని దుర్ వ్యసనాలు జోలికి వెళ్ళరాదు అంటూ తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఏఎల్‌సిఎం క్రీడా మైదానంలో ఆయన విద్యార్థులతో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. నేటి బాలలే రేపటి పౌరులు బాల్యం నుంచే మంచి అలవాటును నేర్చుకుని సమాజాని ముందుకు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. విద్యార్థులు తమ చుట్టూ మత్తు పదార్థాలు అయినా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయించడం కానీ వినియోగించడం కానీ చేస్తే వెంటనే పోలీసులకి సమాచారం ఇవ్వాలని అదేవిధంగా సైబర్ క్రైమ్ ఎలా చేస్తారు దాని నుండి బయటపడే మార్గాలు వాటిపై విశ్లేషించారు. రోడ్డు ప్రమాదాల జరిగే తీరు చిన్న భిన్నమయ్యే కుటుంబాల పరిస్థితి పై వివరించారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కానిస్టేబుళ్లు శీను విజయ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త: రాష్ట్ర టిడ్కో కార్పొరేషన్ ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతినగర్ ప్రాథమిక పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ మాబాషా, కె.కోటయ్య, ఆవుల దాస్, ప్రవీణ్, సుధీర్, పద్మజ, సుజాతలు పాల్గొన్నారు.

## దేవస్థానం సుందరీకరణకు క్షేత్రస్థాయి పరిశీలన



కాణిపాకం, మార్చి 20 ప్రభాతవార్త: ప్రసిద్ద పుణ్యక్షేత్రం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం సుందరీకరణకు ఉపాధి హామీ పథకం రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల బృందం శుక్రవారం ఆలయ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. టూరిజం, ఉపాధిహామీ, పంచాయతీరాజ్,ఆర్‌డబ్ల్యుఎస్, రెవెన్యూ తదితర శాఖలు దేవాదాయశాఖతో సమన్వయం చేసుకుని ఆలయ అభివృద్ధి, సుందరీకణకు సమగ్ర ప్రణాళికలు సిద్దం చేయాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రధాన ఆలయ సమీపంలోని పిళ్ళారి చెరువు కట్టను సుందరీకరణ పనులు చేపట్టేందుకు పరిశీలించారు. ఈమేరకు చెరువు కట్టను అభివృద్ధి చేయడంతో పాటు వివిధ రకాల మొక్కలతో భక్తులకు ఆహ్లాదం కలిగించే విధంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ద చేయాలని రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ అధికారులకు సూచించారు. .ఈకార్యక్రమంలో డ్వామా పీడీ అవసాని రవికుమార్, అదనపు పథక సంచాలకులు మల్లిఖార్జున, ఏపీడీలు సుబ్రమణ్యం, శ్రీనివాసులు, ఏపీఓ బాల, ఆలయ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకార గ్రామాలలో ఆర్టిసి బస్సు ప్రారంభం



వాకాడు, మార్చి 20 ప్రభాతవార్త: మండలం దుగ్గరాజపట్నం పంచాయతీ పరిధిలోని శుక్రవారం కొండూరు పాలెం అంజలాపురం మత్స్యకార గ్రామాలలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్ రెడ్డి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నడిపిస్తున్నారు అన్నారు. కేంద్రంకు సంబంధించిన అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. తీర ప్రాంత మత్స్యకార గ్రామాలలో మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు, బస్సు సౌకర్యం లేదని మా నేతలు తమ దృష్టికి వెంటనే బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని మత్స్యకారులకు తెలిపారు. మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. ఈ బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పెంచలయ్య, టిడిపి ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి, టిడిపి సీనియర్ నాయకుడు చంద్ర భూషణ్ రెడ్డి, మహేంద్ర, బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కుమారి కోటేశ్వరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరావు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పామాంజి కృష్ణయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వల్లి ప్రసాద్, మత్స్యకార కాపులు, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉగాది కానుకగా యువతకు జాబ్ క్యాలెండర్



తడ,మార్చి 20 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఉగాది కానుకగా యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని యువతకు ఉద్యోగ అవకాశం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ బాబు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన్ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడంతోపాటు రాష్ట్రానికి 23 లక్షల కోట్ల పెట్టుబడును తీసుకొచ్చి రాష్ట్రాన్ని సంక్షేమం అభివృద్ధి పదంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. తడ సొసైటీ సభ్యులు సుధాకర్, ఏఎంసీ మెంబర్ బొమ్మన్ ఏకాంబరం, మత్స్యకార నాయకులు జైపాల్, దేశప్పన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతి గ ంగమ్మ జాతర తేదీలు ఖరారు

**- మే 19..20న అమ్మవారి జాతర.. పత్రికకు ప్రత్యేక పూజ !!**



కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతర తేదీలను ఖరారు చేశారు. మే 5న జాతర చాటింపు, మే 19న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, మే 20న అమ్మవారి విశ్వరూప దర్శనం ఉంటుంది. శుక్రవారం రా త్రి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జాతర పత్రికను వేదపండితులు రాయడం జరిగింది. ఏటా ఉగాది పండగ మరుసటి రోజు అమ్మవారి జాతర తేదీలను ఖరారు చేసి పత్రికను రాయడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం అమ్మవారి జాతర పత్రికకు ప్రత్యేక పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు,కడ సభ్యుడు రాజ్‌కుమార్, అర ్చకులు బాబుస్వామి, సోమశేఖర్ శాస్త్రి, కమిటీ మెంబర్లు నరేష్, వినయ్, పవన్ మహేష్, రాజ్‌కుమార్, జయరాంనాయుడు, జ్యోతీష్, కందస్వామి, శరవణ, ఆనంద్, మణి, కాణిపాకం డైరెక్టర్ నరేష్, స్థానిక భక్తాదులు పాల్గొన్నారు.

## ఐఐటిలో సెమి ఆటోమెటిక్ వ్యవసాయ అవగాహన



ఏర్పేడు, మార్చి 20 ప్రభాతవార్త: ఏర్పేడులోని తిరుపతి ఐఐటలోని రీసెర్చ్ పార్క్‌లో శుక్రవారం అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సెమీఆటోమేటిక్ వ్యవసాయ పరికరాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ మీడియాకు వివరించారు. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖకు చెందిన సీడ్ (సైన్స్ ఫర్ ఈక్విటీ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్) విభాగం ఈ కార్యక్రమానికి స్పాన్సర్ ఏజెన్సీగా వ్యవహరించింది. ఈ కార్యక్రమానికి వడమాలపేట గ్రామం నుండి పలువురు రైతులను ఆహ్వానించగా, వీరిలో చిన్న కమతాలు కలిగిన రైతులు లబ్ధిదారులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి తిరుపతి పరిశోధకులు రూపొందించిన యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్ వంటి ల్యాబ్ పరికరాలు, వేరుశెనగ పొట్టు తీసే యంత్రం (డీహల్లర్) యంత్రాలపై ప్రజెంటేషన్లు జరిగాయి. ఈ ప్రత్యేకమైన ల్యాబ్, వ్యవసాయ పరికరాల రంగంలో భవిష్యత్ ఆవిష్కరణలకు ఒక కేంద్రంగా నిలిచేందుకు ఆశాజనకంగా ఉంది. వడమాలపేట నుండి గ్లోవిల్ ఫౌండేషన్ అనే ఎన్జీవోకు చెందిన వెంకటేష్ మరియు వ్యవసాయ అభివృద్ధి అధికారి విజయ్ కుమార్ ి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఐఐటి తిరుపతికి చెందిన కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ తమిదా సునీల్ కుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం డాక్టర్ అజయ్ కుమార్‌లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యకలాపాలను నిర్వహించటం గర్వకారణంగా ఉందని డైరెక్టర్ ప్రొఫెసర్ కె ఎన్ సత్యనారాయణ వివరించారు.

## పుస్తకం ముందు తలదించితే... సమాజంలో తల ఎత్తుకునేలా చేస్తుంది

**-టీటీడీ జేఈఓ డాక్టర్ శరత్**




తిరుపతి విద్య మార్చి 20 ప్రభాతవార్త: తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల 74వ వార్షికోత్సవ వేడుకలు కళాశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడీ జేఈఓ (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్) డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో క్రమశిక్షణతో చదివితే ఆ చదువే భవిష్యత్తులో మనల్ని సమాజంలో తల ఎత్తుకునేలా చేస్తుందని పేర్కొన్నారు.టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 33 విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు యాజమాన్యం సుమారు రూ.119 కోట్లను వెచ్చిస్తోందని, విద్యార్థినులు ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ వార్షిక నివేదికను సమర్పిస్తూ, 202425 విద్యా సంవత్సరం నుండి కళాశాల ఖిస్వయం ప్రతిపత్తిఖి (ఆటోనోమి) హోదాలో కొనసాగుతుందని వెల్లడించారు. సెమిస్టర్ ఫలితాల్లో బీఎస్సీ 100, బీఏ 98 ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎస్వీ యూనివర్సిటీ రెక్టర్ ఆచార్య సిహెచ్. అప్పారావు మాట్లాడుతూ, నాక్ ఖిఏ ప్లస్‌ఖి గ్రేడ్ సాధించిన ఈ కళాశాల విద్యా విధానంలో అద్భుతమైన ప్రమాణాలు పాటిస్తోందని కొనియాడారు. టీటీడీ విద్యాశాఖ అధికారి టి. వెంకట సునీల్ మాట్లాడుతూ, ఇక్కడ చదువుకున్న మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తుండటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్చార్జ్ డా బి జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ డా. జి భద్రమణి, డా వై సునీత, వార్డెన్ డాక్టర్ మల్లీశ్వరి, డిప్యూటీ వార్డెన్లు డా.వసుధ, భారతి, డా వి.కృష్ణవేణి, డా వై శిరీష, జ్ఞాన ప్రసూన, డా.వి లక్ష్మి ్మ, డా కస్తూరి, డా శోభ, డా ప్రవీణ, డా పద్మిని, డా శ్రీలత, డా విజయ కుమారి, డా శ్రీనివాసులు, జి సుధాకర, డా లక్ష్మి ్మ సంధ్య, డా వై.జయశ్రీ, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.చివరగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## టూ వీలర్ మెకానికులకు కమిటీ భవనం మంజూరు చేస్తాం

**-రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**



తిరుపతి కలెక్టరేట్, మార్చి 20 ప్రభాతవార్త: తిరుపతి మోటర్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ చిరకాల కోరిక కమిటీ భవనాన్ని మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటా మని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర అటవీ కార్పొ రేషన్ మాజీ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు, కార్పొరేటర్ నరసింహాచారి ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు అవుల మునిరెడ్డి, సభ్యులు మంత్రిని కలిసి కమిటీ భవనం మంజూరుకై వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్కు పరిశీలనకు పంపి కమిటీ భవనం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల ముని రెడ్డి, కార్యదర్శి గురునాథ ఆచారి, వైస్ ప్రెసిడెంట్ వి. ప్రభు, గౌరవాధ్యక్షుడు టి. జలంధర్, జనరల్ సెక్రెటరీ పి లక్ష్మణరావు, ట్రెజరర్ గౌస్ బాషా, జాయింట్ సెక్రెటరీ పి.తేజరెడ్డి, కమిటీ ఇంచార్జ్ ఎం. కేశవ ఆచారి, ఎలక్ట్రికల్ ఇంచార్జ్ విక్కీ, కె. మణికంఠ, కమిటీ మెంబెర్స్ బి. నాగరాజు, జి. మురగ, తరుణ్, కె. మురగ, బి. పాపయ్య, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.20 కలెక్టరేట్ 02 : మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మునిరెడ్డి

## మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం



చిట్వేలి, మార్చి 20 ప్రభాతవార్త : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కె కె చౌదరి ఆదేశాల మేరకు శుక్రవారం మంత్రి లోకేష్ చిత్రపటానికి రైల్వే కోడూరులో పలాభిషేకం నిర్వహించి, తెలుగు యువత తరపున కృతజ్ఞతలు తెలిపారు. పలువురు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ విడుదలతో పదివేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని. ఇక ప్రతి ఏడాది ఉగాదికి కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షనీయమన్నారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత నాయకులు పోతురాజు సుమన్ రాయల్, మడుపూరి నరేష్, బుంగటావుల రాజశేఖర్, బొబ్బే దునుంజయ యాదవ్, మించల బాలకృష్ణ యాదవ్, హేమంత్ రాయల్, కాకర్ల రెడ్డయ్య, మోసాటి హరినాధ రెడ్డి, తుంగా నవీన్, ఈశ్వర్ యాదవ్, కట్టా గిరిబాబు, పోలిన గణేష్, బాలు నాగేంద్ర, టిఎన్ఎస్ఎఫ్ శివ, బాలాజీ, కస్తూరి జగదీష్, దిలీప్, కట్టా శివ, పాలురి సుధాకర్, ఏదోటి జ్యోతిరామ్, మద్దిన రమేష్, మన్నూరు తేజ, కస్తూరి సురేష్, త్రిలోక్, మురుగయ్య, కాకర్ల ఇందు, అఖిల్, శివప్రసాద్, తేజ, సురేష్, ప్రదీప్, వెంకట్, ముఖ్య యువత సభ్యులు, మరియు రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పులేల రమేష్ బాబు, టిడిపి నాయకులు నార్జాల హేమరాజ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శులు చప్పిడి రమేష్ బాబు, తేనెపల్లి నరసింహులు (చిన్నా) తదితరులు పాల్గొన్నారు.

## బాబు వచ్చారు...జాబులు తెచ్చారు



శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త: బాబు వస్తేనే జాబు వస్తుందనే నమ్మకాన్ని నిజం చేస్తూ ఎన్నో ఏళ్లుగా జాబ్ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతరానికి సరైన సమయంలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి రాష్ట్ర యువతరానికి ఊపిరిలూదారని,ప్రస్తుతం యువతరం బాబు వచ్చారు జాబులు తెచ్చారనిసంబరాలు చేసుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.దశరథాచారి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎన్నికలలో హామీ ఇచ్చినట్లు గానే అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యయంగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తున్నట్లు ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు శ్రీకాళహస్తి పట్టణం, 18 వ వార్డు పరిధిలోని, స్థానిక పూసల వీధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతరానికి పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనతో ఈ ఏడాది ప్రైవేటు రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరగనుంది. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండలం, తెలుగు యువత అధ్యక్షుడు బీమాల చంద్రబాబు, శ్రీకాళహస్తి పురపాలక సంఘం, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తిరుపతి పార్లమెంటు నాయకులు ఆనంద్ రెడ్డి, సయ్యద్ ముజీబ్, గాజుల భగత్, సులేమాన్, గంగనపల్లి రమేష్, సయ్యద్ ఆదిల్, వెంకటస్వామి, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, మారయ్య, సలార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకు సాదర స్వాగతం

తిరుపతి,మార్చి 20ప్రభాతవార్త: తిరుమల,తిరుపతి రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం



సాయంత్రం తిరుపతిలో హెలిప్యాడ్ కు చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు సాదర స్వాగతం పలికారు. ఉండవల్లినుండి హెలికాప్టర్‌లో చేరుకున్న సిఎంకు హెలిప్యాడ్‌వద్ద చిత్తూరు ఎంపి దగ్గు మల్ల ప్రసాద రావు, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, పూతలపట్టు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే లు శ్రీనివాసులు, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, మురళి మోహన్, థామస్, మాజీ మంత్రి పరసారత్నం, తుడా ఛైర్మన్ సి దివాకర్ రెడ్డి, చేనేతకార్పొరేషనఖ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ యాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ పనబాక లక్ష్మీ ్మ, స్వాగతం పలికారు. ఆయన కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న, రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిటిడి ఈఓముద్దాడ రవిచంద్ర, డి ఐ జీ షిమోజి బాయ్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.

## ఏప్రిల్ 11 నుంచి కెవిపిఎస్ ప్రతిఘటన

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త :



ఏప్రిల్ 11 నుంచి 14వ తేదీ వరకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఊరూరా ప్రతిఘటనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. స్వాతంత్రం సిద్ధించి 80 ఏళ్ళు కావస్తున్నా సమాజంలో కుల వివక్ష, అంటరానితనం సమసిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి దళితులకు ఆలయ ప్రవేశం లేదనీ, రెండు గ్లాసుల విధానం కొనసాగుతోందని విచారం వ్యక్తం చేశారు. దళిత, గిరిజనులు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారనీ, సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల వృత్తి ఆధారంగా జీవనోపాధి పొందుతున్న డప్పు కళాకారులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. పూలే, అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని 11 నుంచి 14 తేదీ వరకు ప్రతిఘటనా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షులు ఎన్డీ శ్రీను, గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య, రెడ్డిపల్లి సురేష్, అరుణాచలం, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య, పెంచలయ్య, మధుసూదన్ రావు, ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువత ఉద్యోగులపై హర్షం

తొట్టంబేడు, మార్చి 20 ప్రభాతవార్త :




టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో ఐటి విద్య మంత్రివర్యులు నారా లోకేష్ సారధ్యంలో యువతకు ఇచ్చిన ఉగాది కానుక జాబ్ క్యా లెండరు ఇది ఒక చారిత్రాత్మకమైనటువంటి కార్యక్రమం అని గురువారెడ్డి అన్నారు. జగన్మోహన్ రెడ్డి తన 5 ఏళ్ళ పాలనలో ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అని నమ్మబలికి యువతను దగా చేసారనీ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిన్న ఉగా ది కానుక గా ఉద్యోగాల భర్తీ కి జాబ్ క్యాలెండరు ను విడుదల చేశారన్నారు. అటు అభివృద్ధి సంక్షేమాన్ని సమపాళ్లలో ప్రజలకు అందిస్తూ ఆరోజు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తూ ముందుకు పోతున్నటువంటి నీతివంతమైన పాలన అందించేటువంటి నాయకుడు చంద్రబాబునాయుడు నారా లోకేష్ అని గురువారెడ్డి అన్నారు. యువత నిరుద్యోగుల తరపున హర్షం వ్యక్తం చేస్తూ గ్రంథాలయాల చరిత్రలో ఇంతవరకు ఉద్యోగాల్ని చాలా కాలం నుంచి భర్తీ చేయకపోవడం ఈరోజు 100 లైబ్రరీ పోస్టులను జాబ్ క్యాలెండర్లో పెట్టి గ్రంథాలయాలను బలోపతం చేస్తున్నటువంటి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని గురవారెడ్డి అన్నారు.

## సహాయం కోరితే ...వేధింపులు

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త:

పేదరికంతో తమకు రావాల్సిన సహాయం అందిచమని ఆశ్రయిస్తే తమను వేధిస్తున్నారని, తమపై తప్పుడు ప్రచారం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని గీతా అనే యువతి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు జిల్లా అధికారులు తెలుగుగంగ ఇఇని విచారణకు ఆదేశించారు. అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షామిలి అనే యువతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఫిర్యాది ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుగంగ కాలనీలో ఒంటరి మహిళాగా ఉంటున్న గీత పినతండ్రి కేశవులు హెచ్ఆర్‌గా తెలుగుగంగ కాలనీలో పని చేస్తూ చనిపోయినట్లు తెలిపారు. ఆయనకు రావాల్సిన వెసులుబాట్లను మంజూరు చేయని కోరగా తెలుగుగంగ అధికారి ఆమెను వేధిస్తున్నాడని, ఆయన మరో వ్యక్తి గంగయ్యను ఉపి కొల్పి తమను మానసికంగా వేధిస్తున్నారని రోదిస్తూ వివరించింది. తన కుమార్తె బిటెక్ చదువుతుందని గౌరవంగా బతుకుతున్న తమను వీధిలో అప్రతిష్ట పాల్జేయటానికి కంకణం కట్టుకున్నారని దాంతో తమకు సుబ్బారెడ్డి, గంగయ్యల వల్ల ప్రాణ హాని ఉందన్నారు. అదే రోజు పోలీసులకు పిర్యాదు చేసినట్లు బాధితురాలు పేర్కొన్నారు. అయితే శ్రీకాళహస్తి వన్‌టౌన్, టూటౌన్ సిఐలకు వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని వివరణ ఇచ్చారు.

## భోజన ప్లేట్లు పంపిణీ

శ్రీకాళహస్తి రూరల్ మార్చి 20 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగ గ్రామంలోని ఎంపీపీ స్కూల్ నందు పాఠశాల విద్యార్థి, విద్యార్థినులు సుమారు 54 మంది కి శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేయుటకు స్టీల్ ప్లేట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయు రాలు హేమ, లత తమ సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పుడు మాట్లాడుతూ పాఠశాల యొక్క విద్యార్థుల బలోపేతానికి ఉపాధ్యాయలు, విద్యాకమిటీ గ్రామస్తులు కలసి కట్టుగా పనిచేద్దామాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయల బృందం, ఎస్ఎంసి చైర్మన్ వెంకటేష్, మాజీ సర్పంచ్ సోయిండి. ఈశ్వర్ రెడ్డి, శంకర్ రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల విద్యార్థికి గోల్డ్ మెడల్

రైల్వేకోడూరు రూరల్, మార్చి 20ప్రభాతవార్త:



రైల్వే కోడూరు పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల బీఎస్సీ పరీక్షల్లో కళాశాలకు చెందిన హారిక పరీక్షా ఫలితాలలో అద్భుత విజయాన్ని సాధించి గోల్డ్ మెడల్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హారిక 20212024 విద్యా సంవత్సరంలో బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ విభాగంలో చదువుతూ దిబిశితి 9.62 సాధించి విశ్వవిద్యాలయం అందించే డాక్టర్ చెమ్మర్తి నాగేశ్వర రాజు గోల్డ్ మెడల్ ను అందుకున్నారు. ఈమె గోల్డ్ మెడల్ సాధించి కళాశాలకు మరింత ప్రతిష్టను పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముత్యాల పెంచలయ్య మాట్లాడుతూ కృషి, పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను సాధించాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## జడ్‌పి సిఇఓకు ఆహ్వానం



ఏర్పేడు, మార్చి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పే డు మండలం గుడమల్లంలో వచ్చే నెల 19 నుంచి జరిగే మహాకుం బాభిషేకానికి అధికారులు, రాజకీయ నాయకులకు చైర్మెన్ బత్తల గిరినా యుడు, ఇఓ రామచంద్రారెడ్డిలు విధులు విభజించుకొని స్వాగతాల పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జడ్‌పి సిఇఓ రవినాయు డును కలసి ఆహ్వానించారు. అలాటే ఆలయం వద్ద జరుగుతున్న పనుల్లో భాగస్వాములు కావాలని కోరారు. తప్పక సహాయం అందిస్తామంటూభరోసా ఇచ్చారు.

## అందని ద్రాక్షలా ఆ అధికారి విధులు..!!

చిట్వేలి, మార్చి 20 ,ప్రభాతవార్త: అరటి, బొప్పాయి, పసుపు, మామిడి సంబంధిత వాణిజ్య పంటలకు రైల్వే కోడూరు పరిధిలోని చిట్వేలి మండలానికి ప్రత్యేక స్థానం ఉంది. కాగా పంట సాగులో, చీడపీడల నివారణలో, అధిక దిగుబడిలో రైతులకు సలహాలతో పాటు సంబంధిత పంటలను పర్యవేక్షించవలసిన బాధ్యత ఉద్యాన శాఖ అధికారిపై ఉంది. అయితే చిట్వేలి మండలంలో నియమింపబడ్డ ఆ అధికారి రైతులకు అందుబాటులో లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. వారానికి ఒక్కసారి సోమవారం నిర్వహించే గ్రీవెన్ సెల్ కు తప్ప మిగిలిన రోజుల్లో కార్యాలయాల్లో లేకపోవడం రైతులు ఎరువులు, పురుగు మందులు అమ్మే షాపు వారిపై ఆధారపడి అధిక మందులను పిచికారి చేస్తూ పంట తో పాటూ ఇటు ఆర్థికంగా నష్టపోతు మరింత కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ మామిడి సీజన్లో రైతులకు అందుబాటులో ఉండి దశలవారీగా ఎలాంటి మందులు వాడాలి, ఎంత మేరా వాడాలి అన్న విషయాలను చేరవేయాలని జిల్లా కలెక్టర్ ఆ అధికారికి సూచించినప్పటికీ వాటన్నింటినీ బేఖాతారు చేసి రైతులకు అందుబాటులో లేకుండా కాలయాపన చేస్తున్నాడని మండల రైతులు వాపోతున్నారు. 202526 ఏడాదికి గాను చిట్వేలి మండలానికి 82.65 లక్షల గ్రాంట్ విడుదల అయినప్పటికీ.. ఆ అధికారి నిర్లక్ష్యం ఈ గ్రాంటు ఇతర మండలాలకు బదిలీ అయిందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ఇటీవల మామిడి రైతులకు పండ్ల కవర్లు, లింగాకర్షక బుట్టలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించినప్పటికీ.. వాటిని సచివాలయాలకు చేర్చి, కావలసిన రైతులకు సంబంధిత గ్రామ వ్యవసాయ అధికారుల ద్వారా అందించాల్సిన బాధ్యత ఆ అధికారిపై ఉంది. అయితే రవాణా ఖర్చు, కూలీల ఖర్చు అదనంగా అవుతుందని, షాకుగా చూపుతూ కావలసిన రైతులు రైల్వే కోడూరుకు ప్రభుత్వ నర్సరీకి వచ్చి వాటిని పొందాలని హుకుం జారీ చేయడంతో గ్రామస్థాయి ఉద్యాన శాఖ అధికారులు రైతులకు ఏమి చెప్పాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఫోను ద్వారా నైనా సూచనలు, సలహాలు పొందాలని రైతులు ప్రయత్నిస్తే ఫోను తీయడం లేదని రైతులు బాధపడుతున్నారు. గతంలో తాను పనిచేసిన చోట తీవ్ర విమర్శలకు గురై స్వయంగా జిల్లా కలెక్టర్ అతనిని బదిలీ చేశారని.. అయినను అతని తీరు మారడం లేదని, అతని స్థానంలో వేరొకరిని నియమించాలని రైతులు ముక్తకంఠంతో వాపోతున్నారు.

***మెమో అందజేస్తాం.. ఎంపీడీవో*** గతంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి ఆ అధికారి తీరు మార్చుకోవాలని సూచించామని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. ఇకనైనా అప్పగించిన విధులు సక్రమంగా నిర్వహించకపోతే మెమో జారీ చేస్తామని ఎంపీడీవో వివరణ ఇచ్చారు.

## పరివర్తన కోసం వచ్చేదే రంజాన్

– హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త:



రంజాన్‌మాసం ఎంతో పవిత్రమైనదని అంతేకాక మనలో పరివర్తన కోసం వచ్చే దివ్యమాసం రంజాన్ అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో మనం కొన్ని సొంత విధానాలను రూపొందించు కుంటున్నామని అల్లాహ్ ఆదేశాలను పట్టించుకోవటం లేదన్నారు. ఈదుల్ పితర్ నమాజులు తప్పని సరిగా ఈద్‌గాహ్‌లలోనే ఆచరించాలని సూచిస్తూ శ్రీకాళహస్తిలో మూడు ఈద్‌గాహ్‌లు, మూడుమసీదుల్లో పండగ నమాజులు ఆచరించటం ఆశ్చర్యంగా ఉందన్నారు. శనివారం ఈదుల్ పితర్ నమాజులను ఆచరించి పుణ్యాలను సంపాదించుకోవాలన్నారు. రంజాన్ మాసం వెయ్యిమాసాల కన్నా మిన్న అయినదని దివ్యఖుర్ చెబుతూ వరాల జల్లుకు సదవకాశమని మనం తెలిసి లేక తెలియక చేసిన పాపాలను క్షమించమని కన్నీరుమున్నీరుగా అల్లాహ్‌ను అర్థించాల్సిన మాసాన్ని ఎంత నిర్లక్ష్యంగా గడిపామనేది ప్రతి ఒక్కరు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. అల్లాహ్ ఆదేశాలను మనం పక్కన పెట్టి మన సొంత ఆలోచనలే ఇస్లాం మతమని వ్యవహారించటం సరికాదన్నారు. రంజాన్‌మాసంలో ఎలాగైతే మసీదులు కిట కిట లాడుతాయో అలాగే ప్రతి రోజూ ప్రతి ఒక్కరు ఐదుపూటల నమాజులను అలవాటు చేసుకొని అల్లాహ్‌కు ఇష్టమైన రీతిలో ప్రార్థనలు జరిపి స్వర్గస్తులు కావాలని సూచించారు.

## నేడు ఈదుల్ ఫితర్: ఈద్‌గాహ్‌లు ముస్తాబు

-అల్లాహ్ కరుణకు, వరాలజల్లుకు సుదినం



**శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం శనివారం రంజాన్ సందర్భంగా ఆచరించే ఈదుల్ ఫితర్ ప్రార్థనలకు ముస్తాబు చేస్తున్నారు. రెండు రోజులుగా ఈద్‌గాహ్‌ల నిర్వాహకులు పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలోని ఈదుల గుంట వద్ద ఈద్‌గాహ్, రాజీవ్‌నగర్, అయ్యలనాడు చెరువుల్లో ఈద్‌గాహ్‌లున్నాయి. అలాగే మూడు మసీదుల్లో కూడా ప్రార్థనలకు సిద్ధం చేస్తున్నారు.

***లయల్‌తుల్ జాయజా:***

రంజాన్ మాసంలోని చివరి పది రోజుల్లో ఐదు రాత్రుల్లో ఓ దివ్యరాత్రి ఉందని దివ్యఖుర్ ఆన్‌లో పేర్కొన్నారు. ఈ రాత్రుల్ని అన్వేషిస్తూ రాత్రి జాగరణ చేయటం ఆనవాయితి. ఈ రాత్రుల్ని శ్రీకాళహస్తిలోని ఒక్కొక్క మసీదులో ఒక్కొక్క రాత్రి జాగరణ చేసారు. అర్ధరాత్రి దాటిన తరువాత వేకువ జాము 3గంటలకు కన్నీరు మున్నీరుగా రోదిస్తూ అల్లాహ్ వద్ద ప్రార్థనలు చేసారు. 30 రాత్రి నెలవంక దర్శనం తరువాత (పొద్దుపొడిస్తే పండగ) ఇషా నమాజు తరువాత 'లయతుల్ జాయజా' అని అంటారు. 30రోజుల పాటు ఆచరించిన నమాజులకు ఉపవాసదీక్షలకు ఫలాన్ని ఇచ్చే రాత్రి అంటారు. ఈ రాత్రంతా మేల్కొని వేకువ జామున ఉదయం ఆచరించే నమాజుకు సిద్ధమౌతున్నారు. శ్రీకాళహస్తిలోని ఈద్‌గాహ్‌లలో రంజాన్ పండగ ఈదుల్ ఫితర్ నమాజును ఆచరించే సమయాలను ప్రకటించారు. రాజీవ్‌నగర్‌లో ఉదయం 6.30గంటలకు బయాన్, 7గంటలకు నమాజు, ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో ఉదయం 8గంటలకు ఈదులగుంట ఈద్‌గాహ్‌లో బయాన్ 8.30గంటలకు జమాత్ ఉంటుందని జామియా మస్‌జిద్‌లో శుక్రవారం ముతవల్లి అక్రమ్ సాహెబ్ తరఫున పేష్ఇమాం రేహాన్ ప్రకటించారు. అయ్యలనాడుచెరువులో ఉదయం 8.30గంటలకు బయాన్, 9గంటలకు జమాత్ ఉంటుందని ప్రకటించారు. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కాగా ఈదుల్ గుంట ఈద్‌గాహ్‌లో ఉదయం 8గంటలకు నమాజు ప్రారంభమౌతుందని ప్రకటించారు. ఈదుల్ ఫితర్ ప్రార్థనలు నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఆచరించే ముఖ్యమైన సూత్రాల్లో 'పిత్రా' ఒకటి. కుటుంబంలో బతికున్న ప్రతి ఒక్కరి పేర కనీసం రూ.100లు ఫిత్రా చెల్లించాల్సి ఉంది, దీనిని పేదలకు దానం చేస్తారు. నేటి ధరలననుసరించి ఈ మొత్తాన్ని ఖరారు చేసినట్లు జామియా మస్‌జిద్ మౌలాన రేహాన్ ప్రకటించారు.

## కరిమారియమ్మ ఆలయంలో సుమంగళి పూజలు

**శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త:** ముత్యాలమ్మగుడివీధిలోని జీవనది సువర్ణముఖి తీరాన వెలసిన



కరిమారియమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో 'సు మంగళి పూజలు' నిర్వహిం చారు. ఆలయ ఆవరణలో శుక్రవారం ఉదయం నుంచి మహిళల సందడి చోటు చేసుకుంది. ఇక్కడ సుమం గళి పూజలు నిర్వహించు టకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. మామిడి తోరణాలతో ము స్తాబు చేసారు. అమ్మవారికి కలశాన్ని ఏర్పాటు చేసారు. అలాగే మరో 9కలశాలను ఏర్పాటు చేసారు. అలయ నిర్వాహకుడు పళని స్వామి పర్యవేక్షణలో సుమంగళి పూజలను నిర్వహించారు. ఆతనికి మహిళలు పసుపునీటితో స్నానమాచరింపజేసారు. తరువాత ఉభయ దాతల సారధ్యంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ పూజలకు విశేష సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మొదట అమ్మవారి కలశాన్ని ఏర్పాటు చేసారు హోమాలు నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తూ సుమంగళి పూజ లనునిర్వహించారు. ముత్తైదువులకు పసుపు కుంకుమ, అందజేసారు. తీర్థ ప్రసాదాలను అందించారు.

## దొంగ పత్రాలు సృష్టించి...

రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం ఎర్రమరెడ్డి పాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు ఓ వ్యక్తి దొంగ పత్రాలు సృష్టించి చిన్న టి అంగడి పెట్టుకున్న తన స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని బాధితుడు కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. రేణిగుంట జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సిపిఎం పార్టీ రైతు సంఘం నేతల సహకారంతో పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు కుమారస్వామి మాట్లాడుతూ 1980 నుండి పారిశ్రామిక వాడలో టి అంగడి పెట్టుకొని జీవనోపాధి సాగిస్తున్న అంగడి స్థలాన్ని ఆక్రమించాలని ప్రయత్నం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టి అంగడి పైనే తమ కుటుంబం జీవనం సాగిస్తున్నామని తెలిపాడు. 2010లో ఓ వ్యక్తి టీ దుకాణం సమీప భూమిని కొనుగోలు చేసి టి అంగడికి స్థలానికి సంబంధించి దొంగ పత్రాలు సృష్టించి అంగడి స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితునికి అండగా తామంతా ఉన్నామని సిపిఎం పార్టీ జిల్లా రైతు సంఘం అధ్యక్షురాలు హేమలత బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. పేద కుటుంబానికి చెందిన స్థలాన్ని ఆక్రమించడం అన్యాయం అన్నారు. ప్రజా సంఘాలను ఏకం చేసి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. సమావేశంలో రేణిగుంట మండల రైతు సంఘం అధ్యక్షుడు ముని రామయ్య, కిరణ్ కుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు..

## అధైర్య పడవద్దు అండగా వుంటాను

-రైతులకు పులివర్తి నాని ఓదార్పు

చంద్రగిరి, మార్చి 20 ప్రభాతవార్త:



అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని తాను అండగా వుంటానని ఎంఎల్‌ఏ పులివర్తి నాని ఓదార్పునిచ్చారు. రెండు రోజుల క్రితం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షానికి వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో ఎంఎల్‌ఏ శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా బందార్లపల్లి, ఏ.రంగంపేట, కొటాల, నాగయ్యగారిపల్లి గ్రామాలలో పంటలను పరిశీలించిన ఆయన సుమారు 70-80 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు గ్రహించారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడిన ఆయన రైతులకు పంట నష్టంపై అంచనాలు తయారుచేసి ఇవ్వాలని ఆదేశించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందే విధంగా తాను ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

## ఆర్టీసీ బస్టాండ్లలో షాపుల వేలం

తిరుపతి రవాణ, మార్చి 20 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలోని వివిధ ఆర్టీసీ డిపోల పరిధిలో ఉన్న బస్టాండ్లలో ఖాళీగా ఉన్న షాపులు మరియు స్టాల్స్ నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎం. జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 109 ఖాళీ స్థలాలకు ఈ వేలం ప్రక్రియ నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయాల్లో అన్ని పనిదినాల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు దరఖాస్తులు పొందవచ్చని ఆయన వివరించారు. ఈ దరఖాస్తులను పూర్తి చేసి ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం లోపు సమర్పించాల్సి ఉంటుంది. జిల్లాలోని తిరుపతి, పలమనేరు, పాకాల, శ్రీకాళహస్తి, సత్యవేడు, వాకాడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ,పుత్తూరు వంటి ప్రధాన కేంద్రాల్లో ఈ షాపులు అందుబాటులో ఉన్నాయి. అర్హత మరియు ఆసక్తి గల వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి హెల్త్, మార్చి 20 ప్రభాతవార్త:

ఎపి.డబ్ల్యూ.జే.ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల మార్చి 22వ తేదీ ఆదివారం ఉదయం తిరుపతిలోని రాస్ బిల్డింగ్‌లో నిర్వహించనున్నారని అందరూ కలిసి జయప్రదం చేయాలని కోరారు. తిరుపతి జిల్లా ప్రథమ మహాసభల పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వలిగులం గోపి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాడడానికి, జర్నలిస్టుల గలాన్ని ప్రభుత్వానికి తెలియజేయడానికి ఏర్పడ్డ సంస్థ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ అని అన్నారు. అలాగే జర్నలిస్టులకు సమస్యలపై పోరాటానికి ఈ సంఘం ముందుంటుందని తెలిపారు. జరగనున్న మహాసభకు తిరుపతి జిల్లా జర్నలిస్టు మిత్రులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా నాయకులు, జి. చంగల్రాయలు, (గాంది) పానేటి చెంగల్రాయులు, శ్రీనివాసులు, తిరుపతి నియోజకవర్గం అధ్యక్షులు బాల సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి చామంచి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ వైద్యులు ప్రసాద్‌ని అభినందనలు తెలిపిన సంచాలకులు



**తిరుపతి హెల్త్, మార్చి 20 ప్రభాతవార్త:** వైద్య రంగం న్యూరో సైన్స్ విభాగంలో విశేష వైద్యసేవలు అందించినందుకుగాను శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సి.ఎం. ప్రసాద్‌కి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కళారత్న ఉగాది పురస్కారాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది పురస్కారాలలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో డా.బిసిఎం.ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ బి.సి.ఎం. ప్రసాద్ రెండు దశాబ్దాల కాలంగా స్విమ్స్ తిరుపతి నందు న్యూరోసర్జరీ విభాగంలో విశేష సేవలు అందిస్తున్నారు. ఈయన మార్గదర్శకత్వంలో ఎంతోమంది యువ వైద్యులు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అభ్యసించారు. అంతేకాకుండా ఎంతో మందికి సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి ఎంతో మంది పేషంట్ల యొక్క ప్రాణాలను కాపాడారని కొనియాడారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో మెడిసిన్ విభాగాధిపతి, సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ డాక్టర్ అల్లాడి మోహన్, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ వివి.రమేష్ చంద్ర, ఇతర ఫ్యాకల్టీ వైద్యులు, సిబ్బంది డాక్టర్ బిసిఎం ప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

## పంచాంగం క్యాలెండర్‌ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పుత్తూరు రూరల్, మార్చి 20 ప్రభాతవార్త:



హిందూ ధర్మం2026-27 తెలుగు నూతన శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం క్యాలెండర్‌ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ధనంజయలునాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిస్ట్రిక్ట్ ఎస్సీ వెల్ఫేర్ , ఎంపవర్మెంట్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించి శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన వివి.హరీష్ కొత్తిరుపతి కలెక్టరేట్,

ప్రభాతవార్త

# పట్టాలిచ్చారు...అభివృద్ధి మరిచారు!

-టిటిడిలో మారని అధికారుల తీరు
-సిఎం సారూ పట్టించుకోవాలని ఉద్యోగుల గోడు

తిరుపతి,మార్చి 20ప్రభాతవార్త:



మట్టిగుర్రం నమ్ముకుని సముద్రం ఈదినట్లే అనే చందంగా దార్మికసంస్థ టిటిడిలో మూడుదశాబ్దాలుగా ఉద్యోగుల ఇళ్ళస్థలాల సమస్య తయారైందని పలువురు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా టిటిడిలో అధికారులు మాత్రం మారలేదని, గత అధికారులే కొనసాగుతుండటంతో చాలావరకు ఉద్యోగుల కనీస సమస్యలు కూడా పట్టించుకుని పరిష్కరించలేని సాహసం చేయడంలేదని విమర్శలు. మూడుదశాబ్దాలుగా టిటిడిలో పలు హోదాల్లో ఉద్యోగాలు చేసిన, చేస్తున్న ఉద్యోగులకు వారి స్వతహాగా చెల్లించిన నగదుతోనే అప్పటి బోర్డు ఇళ్ళస్థలాలు కొనుగోలు చేసింది. ఈ నగదుతోనే తొలుత 2014లోనే టిటిడి ఉద్యోగులకోసం దాదాపు 1,500మంది వరకు బ్రాహ్మణపట్టువద్ద ఇళ్ళస్థలాలు కోసం స్థలాన్ని సేకరించారు. అప్పట్లో సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా పట్టాలిప్పించేందుకు దివంగత ఎమ్మెల్యే వెంకటరణ తీవ్రస్థాయిలో ప్రయత్నించారు. అయితే దీనిపై కొందరు హైకోర్టుకు వెళ్ళడంతో అక్కడతో ఆగిపోయింది. ఆ తరువాత పలు దపాలుగా ఉద్యోగులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మళ్ళీ 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పాటై టిటిడి ఛైర్మన్‌గా వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిల హయాంలోనూ ఉద్యోగుల డబ్బులతోనే వడమాలపేటమండలం పాదిరేడు అరణ్యంకండ్రిగ వద్ద 310 ఎకరాలు స్థలాన్ని సేకరించారు. అప్పటి బోర్డు, టిటిడి అధికారులు ప్రస్తుతం జెఈఓగా ఉన్న వీరబ్రహ్మం ఈ పనులన్నీ పర్యవేక్షించి ఉద్యోగులకు ఇళ్ళపట్టాలిప్పించేశారు. అయితే చాలావరకు సమస్యలు ఉన్నా స్థలాలు సిద్దంచేసి పట్టాలు ఇచ్చేశారు. అక్కడ మూడేళ్ళు కావస్తున్నా కనీస మౌళిక సదుపాయాలు కల్పించడంలో టిటిడి అధికారులు విఫలమయ్యారని ఉద్యోగులు ఆవేదన. ఇక సుమారు 3వేలమంది వరకు విశ్రాంత ఉద్యోగులకు ఇళ్లస్థలాలు మంజూరుచేయలేదు. ఉన్నఫళంగా కొందరికి మాత్రమే ఇంటిపట్టాలు ఇచ్చి మిగిలిన వారిని విస్మరించారనేది ఉద్యోగుల పెదవివిరుపు. ఇంకా బ్రాహ్మణపట్టు స్థలాలపై కోర్టు నుండి సానుకూలంగా ఉన్నా టిటిడి అధికారులు సుముఖత చూపడంలేదని చెబుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 21నెలలు కావస్తున్నా, టిటిడిలో కొందరు గత అధికారుల పనితీరులో మార్పులేకపోవడంతో ఇళ్ళస్థలాల సమస్య, ఇంటి పట్టాలిచ్చిన చోట అభివృద్ధిచేయడంలో పరుగులు తీయడంలేదని ఉద్యోగులు విమర్శలు. టిటిడి ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ వేగంగా జరిగినా అభివృద్ధి మాత్రం నత్తనడకన ఉందని అంటున్నారు. సిఎం చంద్రబాబునాయుడు టిటిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉద్యోగుల ఇంటిస్థలాల సమస్య పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# తిరుమలలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,మంత్రి నారాలోకేశ్ శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఇక్కడ గాయత్రి నిలయంఅతిధి గృహం వద్ద సాదర స్వాగతం లభించింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. రాత్రికి చంద్రబాబు కుటుంబంతో పద్మావతిలోనే బసచేస్తారు. నేటి ఉదయం 6.05గంటలకు విశ్రాంతి గృహం నుండి బయలుదేరి ఆలయంకు చేరుకుంటారు. వెంగమాంబ అన్నప్రసాదం భవనం చేరుకుని మనవడి పేరున 44లక్షలు రూపాయలు విరాళం అందిస్తారు. స్వయంగా భక్తులకు అల్పాహారం వితరణ చేస్తారు.

# త్రైతశకం 48వ తెలుగుసంవత్సరాది క్యాలండర్ ఆవిష్కరణ



**శ్రీకాళహస్తి,మార్చి 20 ప్రభాతవార్త:** మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు శుక్రవారం తన కార్యాలయంలో పరాభవ నామ సంత్సరం త్రైతశకం 48వ సంవత్సరం యుగాది క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటి అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం సారధ్యంలో ఈ క్యాలండర్‌ను భగవద్గీత ను మాజీ ఎంఎల్‌ఏకు అందించారు. ఆచార్య ప్రభోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన గ్రంధాన్ని ఎస్‌సివి నాయుడుకు వివరించి ఆవిష్కరింపజేసారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూఈ జ్ఞాన తెలుగు కాల సూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్ధమయ్యే రీతిలో రూపొందించినట్లు వివరించారు. దేవాలయం, సంప్రదాయాలు,ఆత్మజ్ఞానం, తెలుగుపండగల విశిష్ఠత త్రైత సిద్దాంత భగవద్గీత శ్లోకాల సారాన్ని ప్రతి సమస్యకు పరిష్కారం భగద్గీత వివరించారు. ఈ కార్యక్రమాల్లో అతిధులుగా పోలీసు,అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు సంఘానికి చెందిన సి.వెంకటలక్ష్మీ, కె.ధనంజయులు, హరిత, వవెంకటరత్నమ్మ, శ్రీనివాసులు, చామంతి, కృష్ణ,ప్రభోధ కామేశ్వరమ్మ, పద్మమ్మ, ఏకాంబరం, సుధాకర్, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనలో అప్రమత్తంగా ఉండండి

-కమిషనర్ మౌర్య

తిరుపతి,మార్చి 20ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజులు పాటు తిరుపతి, తిరుమల పర్యటన ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులందరూ అప్రమత్తంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారుల ను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న మార్గాలలో జరుగుతున్న ఏర్పాట్లు, పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఉదయం అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన మార్గాల్లో పారిశుద్ధం మెరుగ్గా ఉండేలా చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్లపైన ఎటువంటి గుంతలు లేకుండా చూడాలని, డివైడర్ల మధ్యలో మొక్కలు కత్తిరించాలని, రోడ్డు పక్కన మట్టి, విరిగిన చెట్ల కొమ్మలు లేకుండా శుభ్రం చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలిపిరి, జూ పార్కు రోడ్ల పక్కన ఎటువంటి దుకాణాలు పెట్టకుండా చూడాలని తెలిపారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.మధు, డిసిపీ దేవి కుమారి, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

# బకాయిలకై యూటీఎఫ్ నిరాహారదీక్ష

పుత్తూరు రూరల్, మార్చి 20 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు 2023, జూలై 1వ తేదీ నుంచి చెల్లించాల్సిన పీఆర్సీకి సంబంధించి కమిటీని వెంటనే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న వేలకొద్ది రూపాయల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నగరి నియోజకవర్గ కేంద్రంలో ఒక రోజు నిరాహారదీక్ష నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలియజేశారు. శుక్రవారం నగరి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్షకు సంబంధించిన నోటీసును వారు అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ఎస్.ఎస్.నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ ఏర్పాటులో చేస్తున్న జాప్యం చేస్తుందన్నారు. యూటీఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటామని తెలియజేసిందని, అలాగే అధికారంలోకి రాగానే మెరుగైన పీఆర్సీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాలకు సంబంధించిన యూటీఎఫ్ కార్యకర్తలు, రాష్ట్ర కౌన్సిలర్ దాసరి మునెయ్య, జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, పూర్వ సహాధ్యక్షుడు పి.ఆర్.మునిరత్నం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జయరాజ్, జిల్లా ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్ మురళీకృష్ణ, నాయకులు శరవణ, నరేష్ కుమార్, జనార్ధన్, రూబన్, సంతోష్, హరిప్రసాద్, మహేష్, సురేష్, జనార్దన్, తులసిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదిమంది జూదరులు అరెస్ట్!

రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త:

రేణిగుంట పట్టణం గణేష్ నగర్ నందు రేణిగుంట అర్బన్ పోలీసులు సీఐ జయచంద్ర నేతృత్వంలో శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి పదిమంది పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకొని వారి వద్ద 11,530 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు సీఐ జయచంద్ర అప్రమత్తమై వెంటనే సంఘటనా సంఘటన స్థలమైన గణేష్ నగర్ నందు ఖాళీ ప్రదేశంలో తమ సిబ్బందితో చుట్టూ ముట్టి దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న గణేష్ నగర్, అన్నయ్య నగర్ నగర కు చెందిన మనోహర్, బాలాజీ, దొరబాబు, కావడి బాబు, చక్రవర్తి, సత్యనారాయణ, మునిశేఖర్, ధర్మారావు, విజయ, మధ్యన కుమార్ తదితర పది మందిని అదుపులోకి తీసుకొని పేకాటకు ఉపయోగించిన 52 పేక ముక్కలు, 11,530 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కాలూరు ముస్లిం పేటలో టిడిపి బ్యానర్ల ధ్వంసం....

..వైసీపీ మద్దతుదారులపై ఆరోపణలు.. రంజాన్ ముందు ఉద్రిక్తత..



**తిరుపతి రూరల్ 20 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ మండలం కాలూరు ముస్లిం పేటలో టిడిపి ఏర్పాటు చేసిన బ్యానర్లు ధ్వంసం కావడం స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ ముఖ్య నేత జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లను బ్లేడ్‌తో కట్ చేశారని టిడిపి నాయకులు ఆరోపించారు. ఇటీవల గ్రామంలో టిడిపికి చెందిన ఓ ముస్లిం నాయకుడు, గ్రామ పెద్ద ముత్తువల్లి మధ్య జరిగిన వాగ్వాదం ఈ ఘటనకు కారణమైందని సమాచారం. ముత్తువల్లి అనుచరులే ఈ పనికి పాల్పడ్డారని టిడిపి నేతలు ఆరోపిస్తూ, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు ఇదిలా ఉండగా, రంజాన్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తమవుతోంది. పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీసులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

# ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ : వ్యక్తి మృతి



**శాంతిపురం, మార్చి 20, ప్రభాతవార్త:** పలమనేరు-కుప్పం జాతీయ రహదారిలోని శాంతిపురం మండలం గుండశెట్టిపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి ఓ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న సంఘటనలో రవికుమార్ (32) మృతిచెందాడు. గుండశెట్టిపల్లెకు చెందిన రవికుమార్ ద్విచక్రవాహనంపై వెళుతుండగా వేగంగా వస్తున్నలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని శవపరీక్షకు కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రాళ్ళబుదుగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కల్పవృక్షంపై కరుణామూర్తి

తిరుపతి,మార్చి 20 ప్రభాతవార్త:



కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై కోదండరాముడు భక్తులను అభయమిచ్చారు.

ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. ఈ వాహనసేవలో చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సురేష్, హరీష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రితో పంతగాని మంతనాలు...

రైల్వేకోడూరు రూరల్ మార్చి 20(ప్రభాతవార్త )::



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతికి వచ్చిన సందర్భంలో రైల్వే కోడూరు టిడిపి యువ నాయకులు రాష్ట్ర సాంస్క ృతిక విభాగం అధ్యక్షులు కళాశ్రీ పంతగాని నరసింహ ప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా పంతగాని నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ తిరుమల పర్యటన లో భాగంగా అగ్రికల్చర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతూ రైల్వేకోడూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వాట్ ప్రసాద్ బాగున్నావా అని పలకరింపే తనకు దేవుడిచ్చిన వరమని పంతగాని పేర్కొన్నారు.

# మహా సభలను జయప్రదం చేయండి

తొట్టంబేడు, మార్చి 20 ప్రభాతవార్త:



ఈ నెల 22 నుంచి తిరుపతి వేదికగా జరిగే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ప్రప్రథమ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ ఫెడరేషన్ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రఘు పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద గురువారం ఫెడరేషన్ మహాసభల కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధన శేఖర్, కామేష్, కోట. చంద్రశేఖర్, గంధం మునిచంద్ర, కృష్ణ, రంజిత్, శీను, ముని పాత్రికేయులు పాల్గొన్నారు.

# చక్రేశ్వరస్వామి ఆలయానికి పానమట్టం వితరణ

శ్రీకాళహస్తి,మార్చి 20 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న చక్రేశ్వరాలయానికి శ్రీకాళహస్తికి చెందిన కె.భాస్కర్‌రెడ్డి దంపతులు వితరణ ఇచ్చినట్లు ఆలయాధికారి బికె వవెంకటేశు శుక్రవారం తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలకు భక్తులు విరివిగా విరాళాలు అందిస్తున్నారు. శివయ్యకు బంగారు ఆభరణాలు,ఇతర ఆలయాలకు అవసరరమైన ఉరువులను అందిస్తున్నారు.ఈ నేపధ్యంలో శుక్రవారం కె.భాస్కర్‌రెడ్డి దంపతులు 8కిలోల ఇత్తడి పానమట్టం,నాగాభరణంను విరాళంగా అందించారు.ఈ కార్యక్రమాల్లో డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఉపాలయాల పర్యవేక్షకులు సూపరింటెండెంట్ రవి, లక్ష్మయ్య, అర్చకులు చెంగల్‌రాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో అతిథులు

శ్రీకాళహస్తి,మార్చి 20 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం జ్యూడిషియల్ శాఖకు చెందిన పలువురు జడ్జిలు కుటుంబసమేతంగా విచ్చేసారు. వీరికి దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. మద్రాస్‌హైకోర్టు జడ్జి జస్టిస్ కుమార్పన్ కేరళ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్ నగరేషన్ కుటుంబ సభ్యులతో రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్‌ఓలు రవి,శ్రీనివాసులు వేదపండితులతో స్వాగతం పలికారు. వారికి అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనం తరువాత మృత్యుంజయ స్వామి అలయం వద్ద వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించి తీర్థ ప్రసాదాలను అందించారు.

# బుద్ధి లేకుండా మాట్లాడుతున్న రోజా

– నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



**తిరుపతి హెల్త్, మార్చి 20, ప్రభాతవార్త:** మాజీ మంత్రి రోజా బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. ఆమె మాట్లాడిన పదజాలం చూసి రాష్ట్ర వ్యాప్తంగా అసహ్యించుకుంటున్నారన్నారు. 11 సీట్లకు పరిమితం చేసినా ఇంకా బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రోజా మాతో జగన్మోహన్‌రెడ్డి గాడు అని అనిపించాలని ఉగ్రూతలు ఊగుతున్నారమో అనే అనుమానం వ్యక్తం చేశారు. తిరుమలలో బీరు బాటిల్ పెట్టి అపచారం చేసి.. దానిని ఎన్‌డిఏ కూటమిపై నెట్టారని, అయినా భగవంతుడు ఎవరు చేశారు అన్నది అప్పటికప్పుడే బట్టబయలు చేసేసాడన్నారు. వైసీపీ వాళ్ల ఏమి చేయడానికైనా సిద్ధపడుతున్నారని, జగన్మోహన్‌రెడ్డి క్రిస్టియన్స్‌కి ద్రోహం చేస్తున్నాడని తెలిసి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం క్రిస్టియన్ అని తెలిసి ఓటు వేశారన్నారు. అయినా జగన్మోహన్‌రెడ్డి తాను క్రిస్టియన్ కాదని హిందువునిగా చెప్పుకుంటున్నా డన్నారు. దేశంలోని అందరి క్రిస్టియన్లను కూడా ఆయన అవమానిస్తున్నాడ న్నారు. ఉగాది వస్తే గుడికి వెళ్ళాలి కానీ ఇంటిదగ్గర సెట్టింగ్ చేసుకొని మా నాయకుడు పంచ కట్టాడు,భారతితో ఉగాది పండుగ చేసుకున్నాడని ఈ రోజా ఇక్కడ డాన్సులు వేస్తూ ఉందని అవహేళన చేశారు.అందరూ ఉగాది పండుగను కుటుంబ సమేతంగానే చేసుకుంటారన్న విషయం రోజాకి తెలియనట్టు ఉందన్నారు. ఇకనైనా రోజా తన తీరును మార్చుకోకపోతే ఎక్కడికి పోయినా రోజా అంటే తిట్టుకుంటున్నారన్నారు. ఎప్పటికైనా గౌరవాన్ని ఇచ్చిపుచ్చు కోవాలని హితవు పలికారు.

# సీఎంని కలసిన కిష్టయ్య

సత్యవేడు, మార్చి 20 ప్రభాతవార్త:



తిరుపతి పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని సత్యవేడు కిష్టయ్య యాదవ్ కలసి స్వాగతం పలికారు. సత్యవేడు నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

# పేదలకు నిత్యవసరాలు బట్టలు పంపిణీ...

తిరుపతిమార్చి 20 ప్రభాతవార్త:

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎన్ మస్తాన్ స్థానిక కొర్లగుంటలో పేదలకు, పారిశుద్ధ్య కార్మికులకు నిత్యవసర వస్తువులతో పాటు చీరలను పంపిణీ చేశారు. రంజాన్ పర్వదినాన్ని ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని అల్లా దీవెనలతో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు గుండాల గోపీనాథ్, బిజెపి సెంట్రల్ మండల అధ్యక్షుడు దీపక్ యాదవ్, ఉపాధ్యక్షుడు తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ రెడ్డి బిజెపి నాయకులు ,వరప్రసాద్,,మహమ్మద్ అక్రమ్, చాంద్ బాషా, మహమ్మద్ ఇర్ఫాన్ బిజెపి కార్యకర్తలు అందరూ కలిసి పాల్గొనడం జరిగింది తదితరులు పాల్గొన్నారు.